# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

సెప్టెంబర్ 2024

వెల : రూ. 10.00



## జూన్ 11 నుండి జులై 10, 2024 వరకు శ్రీ మాతాజీవారి అమెరికా పర్యటన దృశ్యములు









# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ

సంపుటి 44 సంచిక 1

పేజీలు 44

సెప్టెంబర్ 2024

5సం॥ల చందా రూ. 500

2సం॥ల చందా రూ. 240

సంవత్సర చందా రూ. 120

విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**

దాశరథీ శతకము .......................... ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట.................................. ............ 7
శ్రీ కాళీ తత్వము .................... ......................10
ముక్తి .................................. ...........................12
బంగారం మూట ....... .... ...........................14
భక్తి - యోగం ......... .......... .......... ......... 16
భగవద్గీత సాధన దీపిక ...........................18
వాల్మీకి ...... ..... .... ............. ........ ........ ..... ........21
శ్రీ నారాయణ స్వామి....... ..............................25
నారద భక్తి సూత్రములు ............... ..............27
సద్గురు పాదుకలు ....................................29
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు ......30
మనశ్శతకము ................................................31
నిరీక్షణ .......................................................................32
కర్మయోగ రహస్యము.... ..........................34
శ్రీ గురుగీత ........................................... .........36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
విష్ణు కథలు ....... ........................... ....................40

## **దాశరథీ శతకము** - భద్రాచల రామదాసు

**50)** **పరుల ధనంబుఁజూచిపర భామలజూచి హరింపగోరు మ**
**ద్గురుతరమానసం బనెడు దొంగనుబట్టినిరూఢదాస్య వి**
**స్ఫురితవివేక పాశములఁ జుట్టి భవచ్ఛరణంబనే మరు త్తరువున**
**గట్టివేయగ దే దాశరథీ కరుణాపయోనిధీ!**



భావం - పరాయి సొమ్ము మీద మక్కువ, పరస్త్రీ వ్యామోహం కలిగించే నా మనసనే పెద్ద దొంగను నీ సేవచే ప్రకాశించిన వివేకమనే తాళ్ళతో బంధించి, నీ పాదములనే కల్పవృక్షమునకు కట్టివేయుము.

*ఎంత చక్రపొంగలి తిన్నా షుగరు ఎందుకు పెరగలేదు?

*కంచి పరమాచార్యులవారు శ్రీ బాబును ఎక్కడ కలిశారు?

*అకారము ఎవరికి సంకేతము?

*కైంకర్యము అని దేనిని అంటారు?

*బూడిద సాధువు అంటే ఎవరు?

*యుద్ధం ప్రారంభంలో దుర్యోధనుడు ఎందుకు భయపడ్డాడు?

*ముగ్గురు మిత్రులు తమకు దొరికిన సంపదను ఎందుకు వదిలేసుకున్నారు?

*వైకుంఠం అంటే అర్థం ఏమిటి?

*జ్యోతిశ్శాస్త్రాన్ని దేనికి వాడకూడదు?

*ఈనాడు ఎన్నో దుర్వ్యసనాలకు లోనైనవాడే రేపు మహాత్ముడు కావచ్చునా?

***సమాధానాలు లోపలి పేజీలలో............................***

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

20-1-1981

ఈ రోజు రాత్రి ప్రార్థన అయిన తర్వాత శ్రీబాబు భక్తులను వుద్బోధిస్తూ "నేను భక్తుడినికాదు, జ్ఞానినికాదు, యోగినికాదు, పరమహంస స్వరూపుడినికాదు, మహాత్ముడినికాదు. మీకు దాసానుదాసుడిని.

మదిలో మాధవుడిని నిలుపుకొని క్రియలో మానవసేవ చేసినవాడు మాధవుడౌతాడు" అన్నారు.



దాస్ అలోచనలో పడ్డాడు.

శ్రీ బాబు కలగజేసుకుని "ఏమిటి దాస్ ఆలోచిస్తున్నావు? నేను ఎక్కడ దెబ్బ తిన్నానా అని కదూ? ఈశ్వరుడు నీలోనే వున్నాడు. అది తెలుసుకో. అది తెలుసుకోవాలంటే గురుదేవుని ఆశ్రయించాలి. గురుకృప లేనిదే సాధ్యము కాదు. ధనము, హెూదా, పలుకుబడి, కీర్తి ఎన్ని ఉన్నా నీకు సాధ్యపడదు. నీకూ ఈశ్వరునికీ మధ్య అవిద్య ఆవరణ అడ్డం ఉంది. దానిని తొలగించేవాడే గురుమూర్తి. మనస్సు గురులక్ష్యార్థమునందు నిలుపు, చాలు. గురువుయందు విశ్వాసము ఉంటే చాలు. విశ్వాసమే భక్తి. భక్తి ద్వారా జ్ఞానము కలుగుతుంది. జ్ఞానము ద్వారా మోక్షాన్ని పొందగలుగుతావు" అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ "గురుకృప ఎంత గొప్పదో మీకు ఒక వుదాహరణ చెప్తాను. ఒకసారి రామకృష్ణ పరమహంస ధ్యానం చేసుకుంటున్న సమయంలో ఆయన దగ్గర కూర్చున్న ఆయన శిష్యురాలు రాసమణి కూడా ధ్యానంలో నిమగ్నమై ఉన్నారు. కాని ఆవిడ మనస్సు నిలకడలేక ఏదో అలోచిస్తూ కూర్చుంది. ఇంతలో శ్రీ రామకృష్ణ పరమహంస ఆవిడ వీపుమీద ఒక్క చరువు చరిచేసరికి ఆమె మనస్సు విషయాదుల నుండి మరలి నిలిచిపోయింది. దివ్యానుభూతిని పొందింది. అమ్మ సాక్షాత్కారాన్ని పొందింది" అన్నారు. దాస్ తిరిగి శ్రీబాబుజీని ప్రశ్నిస్తూ "భక్తి లేకుండా జ్ఞానము రాదు కదా? మరి జ్ఞాని కూడా భక్తి కలిగి ఉండాలి కదా?" అన్నాడు.

శ్రీబాబు సమాధానము చెపుతూ "జ్ఞాని ఎప్పుడూ నిర్గుణస్థితిలో ఆనందాన్ని పొందుతూ ఉంటాడు. భక్తి అనే ప్రశ్నరాదు. అయితే భక్తి ద్వారానే జ్ఞానం లభిస్తుంది" అన్నారు. దాస్ తిరిగి ప్రశిస్తూ "ఎవరైనా జ్ఞాని కావచ్చునా?" అని అడిగారు.

శ్రీబాబూజీ సమాధానం చెపుతూ "ఎవ్వరినీ ఆక్షేపించే హక్కు ఎవరికీ లేదు. ఈనాడు ఎన్నో దుర్వ్యసనాలకు లోనైనవాడే రేపు మహాత్ముడు కావచ్చు. లేక జ్ఞాని కావచ్చు. లేకపోతే మహాపురుషుడో, ఉత్తమ పురుషుడో అవ్వచ్చు. మనము చెప్పలేము. అది విధి నిర్ణయము. మనము ఎంతమంది మహాత్ముల చరిత్రలో చదివాము. వారి జీవితాలే మనకు ఆదర్శము" అన్నారు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**సెప్టెంబర్ 2024**

7 శని : వినాయకచవితి - సా.5.30 గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

18 బుధ: భాద్రపద పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

27 శుక్ర: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**అక్టోబర్ 2024**

3 గురు: శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం

10 గురు: దుర్గాష్టమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

11 శుక్ర: మహర్నవమి, - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

12 శని: విజయదశమి - ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

17 గురు: ఆశ్వయుజ పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

26 శని : శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

31 గురు: నరకచతుర్దశి, దీపావళి పండుగ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

*భవరోగ వైద్యులు-సద్గురునాధులు*

"కాలం యొక్క వేగాన్ని ఆపడం ఎవ్వరి తరమూ కాదు. కాలం ఆగదు. కానీ, ఆ కాలాన్ని కూడా ప్రకాశింపచేసే బ్రహ్మ పదార్థము ఎప్పుడూ ప్రకాశిస్తూనే వుంటుంది. ప్రకృతితో ముడిపడిన జీవులకే కాలంతో పనిగాని, కాలాన్ని దాటి కాలాతీతమైన ఆనందంలో ఓలలాడేవారికి కాలంతో పనేమిటి?



కాలాతీతమైన ఆనందం కేవలం ఒక్క పరమాత్మ వస్తువులోనే మనకి లభ్యమవుతుంది. కాలాతీతుడైన పరమాత్మ యొక్క తత్వం సద్గురు కృపవల్లనే మనకి తెలియబడుతుంది. కాలజ్ఞాన విదగ్రణియైన గురుదేవుని ఆశ్రయించిన భక్తుడిని కాలుడి పాశం కూడా ఏమీ చేయలేదని సమర్థ రామదాసస్వామి శిష్యుడైన మధుకర్ వృత్తాంతం వలన మనకి తెలుస్తోంది.

సమర్థ రామదాస స్వామి వద్ద ఒక చిన్న మధుకర్ అనే ఎనిమిదేండ్ల బాలుడు శిష్యుడుగా వుండేవాడు. వాడు తన తల్లిదండ్రులని కూడా వదలివేసి, గురుదేవుని వద్దనే వుండి సేవ చేసుకుంటూ వుంటాడు. ఒకనాడు మధుకర్ భిక్షాటనకై వెళ్ళి, యింటింటా తిరిగి తిరిగి లేదని అనిపించుకుని, చిట్టచివరికి ఒక యింటి ముందు నిలుచుని, బిగ్గరగా యీ విధంగా 'దాసబోధ'లోని పంక్తులను చదువుతాడు. 'త్రిలోకములు ఎవరి కీర్తిని కొనియాడుతున్నవో, అట్టి సమర్థుడైనట్టి సద్గురువు యొక్క అండదండలుగల శిష్యుడిని వక్రబుద్ధితో గాని, చిన్న చూపుగాని చూసే దమ్ములు ఈ ముల్లోకములలో ఎవరికి కలవు?' అని చదివి, మరల బిగ్గరగా 'జయజయ్ గురదేవ్ సమర్థ్ ! జై జై రఘువీర్ సమర్థ్ !' అని పలికేసరికి, ఆ యింటి యజమానియైన జోషీబువా అనే ఒక జ్యోతిష్య పండితుడు బయటకి వచ్చి ఆ పిల్లవాడిని చూచి, 'ఏమయ్యా! ఇందాక ఏదో శ్లోకం చదివావే! దాని అర్థం నీకు తెలుసా?' అంటాడు.

వెంటనే ఆ చిన్న బాలుడు 'ఎందుకు తెలియదండీ!' అని చక్కగా మళ్ళీ ఆ శ్లోకం చదివి అర్థం చెపుతాడు. ఆ జ్యోతిశ్శాస్త్ర పండితుడు, ఆ పిల్లవాడిని ఎగాదిగా పరీక్షగా చూచి, ఏవేవో లెక్కలు కట్టి, 'చూడు బాబూ! నీవు రేపు యిదే సమయానికి మరణిస్తావు' ఆ గురువెవరో చాలా సమర్థుడంటున్నావు చూడు! వెళ్ళి ఆయన దగ్గర

చెప్పుకో! ఆయన చేత నువ్వు రక్షింపబడితే, ఎల్లుండి మా యింటికిరా! నీకప్పుడు మధుకరి వేస్తాను' అనేసరికి, ఆ చిన్నారి కూన భయంతో నిలువెల్లా వణికిపోతూ, వూరి చివర హనుమంతుడి గుడిలో వున్న తన గురుదేవులయిన సమర్థులవారి సన్నిధికి పరుగు పరుగున వెళ్ళి వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టేసరికి, రామదాసస్వామి అతడి ఏడుపుకి కారణమడుగుతారు. అప్పుడు మధుకర్, జరిగినదంతా చెప్పి 'నేను చచ్చిపోతానుట గురువుగారూ!' అని మళ్ళీ ఆరున్నొక్కరాగం ఆలపిస్తాడు.

అప్పుడు గురుదేవులు విషయాన్ని గ్రహించి, 'ఒరేయ్! మధుకర్! చస్తే చచ్చావుగాని, ముందు వెళ్ళి నాకు స్నానానికి నీళ్ళు తోడరా! నాతోబాటు నువ్వు కూడా స్నానం చేద్దువుగాని!' అంటారు. వెంటనే మధుకర్ 'నేను చచ్చిపోబోతూ వుంటే స్నానం అంటారేమిటి? నాకు ఓపిక లేదు' అంటాడు. అప్పటికే భయంతో పాటూ జ్వరం కూడా వచ్చి, మధుకర్ ఒళ్ళు సలసలా కాగిపోతూ వుంటుంది.

అనుగ్రహ స్వరూపులైన గురుమూర్తి ఆ చిన్నారిని తన ఒడిలో కూర్చోబెట్టుకుని స్నానం చేయించి, బట్టలు మార్చి, ఖిచిడీ (పులగం) చేసి తినమంటారు. అపుడు మధుకర్ 'స్వామీ! నేను చావబోతున్నాను, నాకేమీ సహించదు' అని అంటే, సమర్థులు నవ్వుతూ 'ఒరేయ్! మధుకర్! చావడానికి కూడా బలం కావాలిరా!' అని అతడి చేత తినిపించాక, 'ఒరేయ్! ఛస్తాను, చస్తానని ఇంతవరకూ నా ప్రాణాలు తీశావుగాని, యిక నేను కాస్సేపు పడుకుంటాను. నువ్వు నా పాదాలు పడుతూ వుండు' అంటారు. అంత మధుకర్ 'అదేమిటి స్వామీ, యిక మహా అయితే ఒక గంటో రెండు గంటలో నేను బతికుంటాను. నేను చచ్చిపోయాక మీరు నిద్రపోండి' అంటాడు.

కానీ గురుదేవులందుకు ఒప్పుకోక, 'ఊహు - నాకిప్పుడే చాలా గాఢంగా నిద్ర వస్తోంది. నేను పడుకోవాలి. నువ్వు మట్టుకు, ఎవ్వరొచ్చినా లేవవద్దు. నా పాదాలని మట్టుకు వదలవద్దు. నీ ఒళ్ళోనే వుంచుకుని పడుతూ వుండు' అని చెప్పి, మధుకర్ వొడిలో కాళ్ళు పెట్టి, గుమ్మం వైపు తలపెట్టి నిద్రలోకి జారుకుంటారు స్వామి.

కొంచెం సేపయిన పిదప యమకింకరులు మధుకర్ కోసం రానే వస్తారు. రావడమయితే వచ్చారు గాని, సమర్థుల శిరస్సును దాటుకుని మధుకర్‌ని లాక్కొని వెళ్ళే శక్తి లేక, అతడిని బయటకు రమ్మంటారు. కానీ మధుకర్, 'నేనురాను, నేను గురుపాద సేవ చేసుకుంటున్నాను' అంటాడు. ఆ యమభటులు ఎంత భయపెట్టినా, మధుకర్ గురువాజ్ఞకి కట్టుబడి, తన గురుమూర్తి పాదాన్ని వదలి వెళ్ళడు.

చివరికి పాశం వేసి లాగుదామని ప్రయత్నించినా, ఆ పాశం సమర్థుల తలవేపు నున్న దుప్పటి వరకూ కూడా వెళ్ళదు - యిక పాదాల కడకేం వెళుతుంది? చివరికి వారు యమధర్మరాజుకి జరిగినది చెప్తే, ఆయనే స్వయంగా వెళ్తాడు. ఆయనకి

కూడా అదే అనుభవం ఎదురయ్యేసరికి, చివరికాయన ఓటమిని అంగీకరించి వెనుదిరిగి వెళ్ళిపోతాడు! చూశారా! మహాత్ములు చేసే చికిత్స యీ విధంగా వుంటుంది! భవరోగ మహావైద్యులైన సమర్ధరామదాసస్వామి తన శిష్యుని మృత్యు భయాన్ని దూరం చేయడం కోసం, అతడికి అనేక పనులను పురమాయించి, అతడి మనస్సును మళ్ళించే చికిత్స చేశారు. అవ్యాజ కరుణామూర్తులయిన గురుదేవుల వాత్సల్యాన్ని, ప్రేమని ఎవరు కొలవగలరు. తానే తన శిష్యుడికి సేవలు చేశారు.

చివరగా, కాలాతీత స్వరూపులయిన గురుదేవులు, తమ పాదాన్ని మధుకర్ ఒడిలో పెట్టి, దానిని ఎట్టి పరిస్థితిలోను విడువవద్దని శాసించి, ఆయన యోగనిద్రలోకి జారుకున్నారు. మధుకర్ చిన్న పిల్లవాడైనా కూడా, తన గురుమూర్తిని త్రికరణ శుద్ధిగా నమ్మి, అచంచలమైన విశ్వాసం కలిగి వుండి, యముడే స్వయంగా వచ్చినా కూడా గురువాజ్ఞను మీరలేదు కాబట్టే, యమపాశాల నుండి రక్షింపబడ్డాడు. కులశైలములు పెల్లగిలి వచ్చి పైబడినా, జలరాశులే పొంగి ప్రళయమే కలిగినా, నిజమైన గురుభక్తుడు చలించడు. అలా తన తను, మనో, ధనాలని గురుదేవుని కర్పించుకున్న భక్తుడి బాధ్యతంతా కూడా గురుమూర్తిదే కదా!

ఆ పిమ్మట సమర్థులు ఆ జ్యోతిశ్శాస్త్ర పండితుడిని పిలిపించి, తనకు తెలిసిన శాస్త్రాన్ని మంచికి వినియోగించాలి గాని, యీ విధంగా 'నువ్వు ఫలానా టైముకి చస్తావు' అని చెప్పి వాళ్ళని భయకంపితులని చేయడం జ్యోతిశ్శాస్త్రానికే అవమానమని నాలుగు చీవాట్లు వేసేసరికి, ఆ పండితుడు తన తప్పు తెలుసుకుని, సమర్థుల శిష్యుడై, తన శేష జీవితాన్ని రామనామ ప్రచారానికి వినియోగించుకుంటాడు.

అటువంటి సత్యగురుమూర్తిని ఆశ్రయించి, యీ జనన మరణములనే విషయ వలయం నుండి తరింతురు గాక. జగన్మాత దివ్యాశీస్సులు మీ అందరిపై సంతతధారగా వర్షించుగాక!

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, కట్టమూరు నివాసస్థులు అయిన శ్రీ మందడి శివయ్యగారు 8-8-24 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 84 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# శ్రీ కాళీ తత్వము

- ప్రసాద వర్మ కె.

కాళీ రూపం - తంత్ర గ్రంథాలలో అనేక రూపాలుగా చెప్పబడ్డాయి. ప్రధానంగా దంష్ట్రా కరాళ వదనం, ముండమాలా ధారణ, చాపిన నాలుక, దిగంబరత్వం సామాన్య లక్షణాలు. ఇక చేతుల సంఖ్య, ఖడ్గ, చక్ర, ధనుర్బాణ, శంఖ, భుసుండి ఇత్యాది ఆయుధాలు ధరించడం భిన్నభిన్నంగా వున్నాయి. చతుర్భుజగా ఖడ్గము, ఖండిత శిరస్సు, వరద అభయ ముద్రలతో వుంటుంది. అగ్ని సప్త జిహ్వలలో కాళిక ఒకటి అని ఉపనిషత్తులు పేర్కొన్నాయి. ఈమె విగ్రహ మూర్తులలో నాలిక చాపి వుండటం గమనార్హం. మరికొన్ని తంత్ర గ్రంథాలలో అష్టవిధ కాళికా మూర్తుల వర్ణన వున్నది.



దక్షిణ కాళిక, సిద్ధకాళిక, గుహ్యకాళిక, శ్రీకాళిక, భద్రకాళిక, చాముండాకాళిక, శ్మశానకాళిక, మహాకాళిక.

కాల క్రమంలో భక్తి ఉద్యమాలు, తాంత్రిక మత శాఖలు ప్రాచుర్యం పొందినవి. దీని ఫలితంగా ఈమె జగన్మాతగా, ఆదిశక్తిగా, శాక్తేయ మత శాఖగా విస్తృతి పొందాయి. చివరకు ఆమె మోక్షప్రదాయిని అగు శుద్ధ బ్రహ్మమే అని నిర్వచించారు. దక్షిణాసియా అంతటా, ప్రధానంగా కాశ్మీర్, నేపాల్, బెంగాల్, అస్సామ్, దక్షిణ భారతము వంటి చోట్ల మాతృరూప ఆరాధనలో ప్రధాన దైవతంగా భాసించింది.

ఇక మహాకవి కాళిదాసు, తెనాలి రామలింగడి కథలు లోక ప్రసిద్ధములు. ఒక రాజుకు సౌందర్యవతియైన కుమార్తె వున్నది. ఆ రాజుగారి ప్రధానమంత్రి ఆమెను తన కుమారునకిచ్చి వివాహం చేయాలని ఆశించాడు. రాజుగారు అంగీకరించలేదు. కోపించిన మంత్రి ఒక మూర్ఖుడైన యువకుడికి రాజువేషం వేసి, రాజకుమారుడని నమ్మించి పెళ్ళి జరిపించేశాడు. తొలిరాత్రి రాకుమారి అసలు విషయం తెలుసుకుంది. భర్త విద్యావిహీనుడే కాని, స్వభావతః మంచివాడని గ్రహించి, గొప్పవిద్యావేత్తను చేయాలనుకున్నది. ఉజ్జయిని మహాకాళి అనుగ్రహాన్ని పొందే మార్గం చెప్పింది. భార్య మాటప్రకారం మరునాడు కాళికాలయానికి వెళ్ళాడు. ఆమె గుడిలో లేదు. లోక సంచారానికి వెళ్ళింది. ఇతను గుడిలో ప్రవేశించి తలుపు గడియ వేసుకున్నాడు. తెల్లవారురుఝామున తిరిగి వచ్చిన కాళిక గర్భాలయంలోకి వెళ్ళలేకపోయింది. తలుపు

తీయమని ఆజ్ఞాపించింది. నాకు విద్యలన్నీ ఇస్తేనే తలుపు తీస్తానని చెప్పాడు. దయతలచి, తలుపుకున్న చిన్న సందు దగ్గర నాలుక చాపమన్నది కాళిక. ఆ సందులోంచే తన వేలుతో వాని నాలుకపై వాగ్బీజాన్ని లిఖించింది. ఆ ప్రభావంతో అతడు విద్యాధికుడై, మహాకవియై, విఖ్యాతుడయ్యాడు.

అలాగే తెనాలి రామలింగడు గురించి ఎన్నో కథలున్నాయి. రామలింగడు కాళికను గురించి తపస్సు చేశాడు. అతడి సాధనకు సంతోషించి, రెండు చేతులలో పాలు, పెరుగు వున్న పాత్రలు ధరించి ఆమె ప్రత్యక్షమై, ఒకటి విద్యను, మరొకటి ఐశ్వర్యాన్ని ఇస్తుంది. ఏది కావాలో కోరుకోమన్నది. అమ్మా! రెండూ నా చేతికివ్వు నేను ఏది కావాలో ఎంచుకుంటాను అని రెండూ గ్రహించి, రెండూ గటగటా త్రాగివేశాడు. దేవి కోపగించి నీవు వికటకవివి అగుదువు గాక! అని అన్నది. అందుకే రామలింగడు వికటకవి అయ్యాడు అని జనశ్రుతి.

కాళీ సాధన వల్ల కర్మ పరిపక్వత త్వరితంగా అవుతుంది. అనేక జన్మల కర్మానుభవం ఒక్క జన్మలోనే పూర్తి అవుతుంది. ఆ దివ్య శక్తి ప్రసన్నురాలైనప్పుడు మానవుడు సాధించలేనిదంటూ వుండదు. ఈ సత్యానికి నిదర్శనగా నిలచిన సాధకులు పురాణకాలం నుండి ఆధునిక కాలం వరకు ఎందరో కానవస్తారు. అందులో శ్రీ రామకృష్ణ పరమహంస, ఆనందమాయి, భైరవీ బ్రాహ్మణి, ములుగు పాపయారాధ్యులు, త్రైలింగ స్వామి, కుర్తాళం పీఠాధిపతులు శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామి వంటి కాళీమంత్ర సిద్ధులైన మహనీయులెందరో వున్నారు. మన గురుదేవులు శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీవర ప్రసాద బాబూజీ వారి పేరులోనే కాళీ వున్నది. వారి నిత్య అర్చామూర్తులలో కాళి ప్రధాన దైవం. శ్రీబాబు అక్షరాభ్యాస సందర్భంలో పలక మీద బలపం పెట్టగానే పలక మీద కాళీమాత దర్శనం అయింది. అంతటితో అక్షరాలు దిద్దకుండానే వారి ప్రాపంచిక విద్యాభ్యాసం ముగిసింది. గురుదేవులు భక్తుల గృహాలలో కాళికా పరమేశ్వరి ఆరాధనోత్సవాలు నిర్వహించిన ఉదంతములెన్నో వారి జీవిత చరిత్రలో చూడవచ్చు. శ్రీ బాబూజీవారు కాళికా పరమేశ్వరి నిత్య దర్శనానుభూతిని, అద్వైతానుభూతిని అనుభవించి కాళీ సిద్ధులైన కారణ జన్ములు.

దేదీప్య మానోజ్జ్వల శక్తి చండాం ధృతాసి శూలోగ్ర కపాల రుండాం
త్రినేత్ర ఫాలాం గళ ముండమాలాం కాళీం కరాళీం సతతం భజామి.

# ముక్తి

- పాలూరి కాళీప్రసాద్

వైష్ణవ సంప్రదాయంలో ముక్తిని నాలుగు అంచెలుగా వర్ణించారు. ఈ భూలోకంలో జీవించినన్నాళ్ళు శ్రీమహావిష్ణువుపై అనన్య భక్తిని కలిగి ఉండి, మరణించిన తరువాత వైకుంఠాన్ని చేరడం ఇందులో మొదటి మెట్టయిన సాలోక్య ముక్తి. అంటే స్వామి ఉన్న లోకంలోనే మనమూ నివసించడం. ఇక దాని పైమెట్టు సామీప్యం - అంటే ఆ లోకంలో ఎక్కడో దూరంగా ఉండటం కాకుండా స్వామివారికి అతి దగ్గరలో ఆంతరంగిక సేవకునిగా మెలగడం. ఇక అలా సేవించుకున్న ఫలితంగా వచ్చేది సారూప్యం. మనకు జయవిజయులను చూపిస్తూ ఉంటారు కదా! వారు కూడా విష్ణుమూర్తిలాగానే నాలుగు చేతులు కలిగి, శంఖ చక్ర గదా పద్మాలను ధరించి వుంటారు. అలా స్వామివారి రూపాన్ని పొందడం సారూప్య ముక్తి. ఇక చివరిమెట్టు సాయుజ్యం - అంటే ఆ పరమాత్మునిలో ఐక్యం అయిపోవడం.

ఈ నాలుగింటిపై కొంచెం లోతుగా విచారణ చేద్దాం. ఎందుకంటే అద్వైత సిద్ధాంతంలో ముక్తి అనేది చనిపోయాక పొందేది కాదు. బ్రతికి ఉండగానే నీ అసలు స్వరూపాన్ని గుర్తించి ఈ శరీరంతోనే జీవన్ముక్త స్థితిని అనుభవించాలి. ఇక పైన చెప్పుకున్న నాలుగు అంచెల ముక్తిని గూర్చి విచారిస్తే - ముందుగా సాలోక్యం అంటే పరమాత్మ వున్న లోకంలో మనం నివసించడం అని చెప్పుకున్నాం కదా. కానీ ఆయన ఉన్న లోకం ఏది? విష్ణువు అంటేనే సర్వవ్యాపకుడు అని అర్థం కదా! మరి ఆయన లేని స్థానం కానీ, లోకం కానీ ఈ సృష్టిలో ఎక్కడైనా ఉందా? అంతేకాక గీతలో స్వామే స్వయంగా చెప్పినట్లు ధర్మ సంస్థాపన కోసం ఆయన మాటిమాటికీ అనేక మహాత్ముల, గురువుల, అవతారపురుషుల రూపాలలో మన మధ్యన సంచరిస్తూనే ఉన్నాడు కదా! అయితే ఈ విషయాన్ని గుర్తించి సదా అనుభవంలోకి తెచ్చుకోవడమే సాలోక్యం. అంటే మన జీవితంలో ప్రతి క్షణం పరమాత్మ ఉన్న లోకంలోనే, పుణ్యక్షేత్రంలోనే, వైకుంఠంలోనే మనం జీవిస్తున్నామనే ఎఱుక కలిగి ఉంటే మనం ఇక పాపాలు చేయలేము కదా! మనలోని మానసిక బలహీనతల వలనే మనం పాపాలు చేస్తాం. కుంఠితం అంటే బలహీనమైనది. కుంఠితం కానిది వైకుంఠం. ఇలా నిరంతరం స్వామి ఉనికిని గుర్తిస్తూ మన మనస్సు ఎప్పుడైతే తన బలహీనతలను అధిగమిస్తుందో అప్పుడు ఆ మనస్సే వైకుంఠం అవుతుంది.

ఇక దీని పైమెట్టు సామీప్యం. కేవలం ఆ స్వామి ఈ లోకంలో ఎక్కడో వున్నాడని మాత్రమే కాకుండా నిరంతరంగా ఆయన సన్నిధిని మనం అనుభవంలోనికి

తెచ్చుకోవాలి. ఆయన ఎప్పుడూ మన ప్రక్కనే, మనతోనే, మనలోనే ఉంటాడు. ఈశ్వరస్సర్వ భూతానాం హృద్దేశే అర్జున తిష్ఠతి. ఆయన లేనిదే మనం లేము. ఈ నిరంతర సామీప్యాన్ని మనం అనుభవంలోనికి తెచ్చుకుంటే ఇక ఈ లోకంలోని ఈ కష్టాలు, బాధలు, సుఖదుఃఖాలు మనలను బంధించలేవు. నిరంతరం తన తల్లిదండ్రుల దగ్గర నివసించే పిల్లవానికి దేనిమీద చింత ఉంటుంది? అంతా వారే చూసుకుంటారనే నిశ్చింతతోనే హాయిగా బ్రతికేస్తాడు కదా! అదే సామీప్య ముక్తి.

మరి సారూప్యం అంటే పైన చెప్పుకున్నట్టు ఆ స్వామి యొక్క రూపాన్ని మనం కూడా ధరించాలని, కొందరు అచ్చంగా విష్ణుమూర్తి, శివుడు, లేదా తన గురుదేవులు ధరించే విధంగానే నుదుటిపై నామాన్ని ధరించడం, వారిలాగానే పీతాంబరాన్నో, జింక చర్మాన్నో ధరించడం, వారి హావభావాలను అనుకరించడం చేస్తూ ఉంటారు. ఎంత సాధన చేసి అచ్చుగుద్దినట్లు అనుకరించినా అది అనుకరణే అనిపించుకుంటుంది కానీ వీరు వారవ్వరు కదా! పరమాత్మతో సారూప్యాన్ని పొందడం అంటే ఆయనలో ఉన్న సద్గుణాలను మనం అలవరచు కోవడం. ఆయనలో లేని దుర్గుణాలను మనలోనుండి తొలగించుకోవడం. అంతేకాదు ఈ సర్వ సృష్టిని విష్ణుమయంగా దర్శించే దృష్టిని అలవరచుకోవడం. చూడక మానవు చూచెడి కన్నులు ఏడనేడైన ఇతరములు, ఈడ నన్నింట నీ రూపము గన ఈడు లేని తెలివీయగదే అని ప్రార్థించాడు అన్నమయ్య. అటువంటి పరమాత్మ దృష్టిని అలవరచుకోవడం సారూప్యం.

ఇక తన చుట్టూ ఉన్న సృష్టి అంతటిలో పరమాత్మనే దర్శిస్తూ ఉంటే తాను మాత్రం ఆ పరమాత్మకు భిన్నంగా ఉంటాడా? ఈ కనిపించే దేహం తాను కానని, ఈ దేహాలన్నింటినీ నడిపించే పరమాత్మ తానే అనే సత్యాన్ని గ్రహిస్తాడు, అనుభవిస్తాడు. అదే సాయుజ్య ముక్తి. కేవలం తాను తప్ప మరియొకటి లేదనే ఎఱుకయే కైవల్యం. అటువంటి ముక్తిని పొందినవాడికి ఇక దేనిమీదా మోహం కానీ, రాగద్వేషాలు కానీ కలుగవు. ప్రారబ్ధం ఉన్నంతవరకు ఈ దేహం నిలిచి ఉంటుంది. అయితే ఈ దేహంతో చేసే కర్మలు ఏవీ తనకు అంటవు. ఎందుకంటే వాటి వెనుక తనకు ఏదో కావాలనే కోరిక కానీ, తాను చేస్తున్నాననే అహంకార భావన కానీ ఉండదు. అవన్నీ లోకకళ్యాణం కోసం చేసే లీలలే అవుతాయి కానీ, తనను బంధించే కర్మలు కావు. ఎప్పుడైతే ఆ ప్రారబ్ధం తీరి ఈ దేహం పడిపోతుందో, అప్పుడు తాను స్వస్వరూప లయం పొందుతాడు.

**ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి**
**స్థిత్వాస్యామంత కాలేపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి**

# బంగారం మూట

- భాగవతుల జయప్రద

ఒక ఊరిలో ముగ్గురు స్నేహితులు ఉండేవారు .వారు ముగ్గురు ప్రాణ స్నేహితులలాగా అనుక్షణం మెలిగేవారు. ఒకరు అంటే ఒకరికి అభిమానం, నమ్మకం ఉండేవి. ఒకసారి ఆ ముగ్గురు స్నేహితులు డబ్బు సంపాదించడం కోసం వేరే ఊరి ప్రయాణం పెట్టుకున్నారు. దారిలో ఒక అడివిని దాటాల్సి వచ్చింది. ఆ రాత్రికి అక్కడే పడుకుని ప్రొద్దున్నే వెళ్దామనుకున్నారు. రాత్రికి ఒక చెట్టు కింద పడుకున్నారు. ప్రొద్దున్నే లేచి చూసేసరికి వాళ్ళకి ఒక మూట నిండా బంగారం కనబడింది. దాన్ని చూడగానే వారు ఏ పని మీద ఐతే వెళ్తున్నారో దాని గురించి మర్చిపోయి, ఆ మూటలో ఉన్న బంగారాన్ని ఏం చెయ్యాలి, ఎక్కడ దాచాలి, ఎలా పంచుకోవాలి అనే ఆలోచనలో పడ్డారు.

ముగ్గురులో మొదటివాడి పేరు “అనుమానం”. రెండోవాడి పేరు “సందేహం”, మూడోవాడి పేరు “భయం”. మొదటివాడైన అనుమానం, రెండోవాడైన సందేహంతో ఇలా అన్నాడు “ఒరేయ్ సందేహం.... , ఇది ఎవరిది అయ్యి ఉండవచ్చు? ఒకవేళ మనం దీన్ని తీసుకుని వెళ్తే, రక్షకభటులు వచ్చి మనల్ని రాజుగారి దగ్గరకు తీసుకుని వెళ్తారేమో! ఆ తర్వాత దొంగతనం నేరం కింద మనకి శిక్ష తప్పదు ఏమో ... నీకు ఏమనిపిస్తోంది?” అని అడిగాడు.

అప్పుడు రెండోవాడైన సందేహం ఇలా అన్నాడు .. “ఒరేయ్ అనుమానం! నీ పేరుకు తగ్గట్టు నీకు అన్నీ అనుమానాలే, అయినా ఇది ఎవరిది ఐతే మనకి ఎందుకు? మనకి దొరికింది కాబట్టి ఇక మనదే...! అందుకని మనమే పంచుకుందాం. కానీ నాకు ఒకటి తోస్తోంది.. అసలు ఇది నిజమైన బంగారమేనా? ఒక వేళ నిజంగా బంగారం ఐతే, ఇలా ఎవరు పారేసుకుంటారు? అందుకని ముందుగా అసలు బంగారం అవునో కాదో కనుక్కుని, పరీక్ష చేసి ఆ తర్వాత నిర్ణయం తీసుకుందాం” అని అన్నాడు.

ఇంతలో మూడోవాడైన “భయం” ఇలా అన్నాడు. “ఒరేయ్ ఏది ఏమైనా సరే, నాకు చాలా కంగారుగా, ఆందోళనగా ఉంది. ఇది ఎవరిదో ఏమిటో? పైగా బంగారం అవునో, కాదో, మనం దీనిని తీసుకుంటే వచ్చే ప్రమాదాలు ఎలా ఉంటాయో ఏమిటో, వాటి పర్యవసానాలు ఎలా

ఉంటాయో ఏమిటో.. ఇవి అన్ని తలుచుకుంటే నా గుండె గుభేలు మంటోంది!" అని అన్నాడు.

ఇలా ముగ్గురు ఒకరితో ఒకరు వాదించుకుని, చివరికి చేరాల్సిన గమ్యస్థానం చేరకుండానే ఆ మూటను అక్కడ పడేసి, ఎవరి ఇళ్లకు వాళ్ళు వెళ్ళిపోయారు.

ఈ కథ లో ఉన్న పాత్రలు, కల్పితాలు అయినప్పటికీ ఇవి మనలో ఉన్న మానసికభావాలను వ్యక్తీకరిస్తున్నాయి.

ఆంజనేయుడు సీతమ్మని వెతకడానికి బయలుదేరుతున్నప్పుడు ఆయనలో "అసలు నేను ఈ కార్యమును చేయగలనో లేదో" అనేటటువంటి సందేహమును రానివ్వలేదు. నిశ్చలమైన బుద్ధితో, రామనామ స్మరణ అనే దిక్సూచితో, వారధిని లంఘించాడు. మైనాకుడు, సురస, సింహిక, లంకాధిదేవత ఇలా ఎన్నో అవరోధాలను దాటాడు. తీరా లంకకు చేరాక, సీతమ్మను వెతికే పనిలో, ఒకానొక చోట అనుమానపడినా కూడా అక్కడ కూడా "రామ నామ" స్మరణతోనే సీతమ్మను కనుగొన్నాడు. రావణునికి తన ఉనికి చూపించాడు. తోకకు నిప్పు పెట్టినా కూడా ఏ మాత్రమూ భయపడక రామ కార్యాన్ని సఫలీకృతం చేశాడు. తాను దేనికి ఐతే నియమింపబడ్డాడో దాని యొక్క భవిష్యత్తు పర్యవసానాలు అర్థం చేసుకుని ఆ ప్రకారం నడుచుకున్నాడు. నిజమైన రామభక్తుడు అయ్యాడు.

మానవునికి వున్న అవరోధాలే "అనుమానం" "సందేహము" "భయము". తాను చేస్తున్న సాధన సరైనదో కాదో అనే అనుమానం. సాధనలో లోపాలు గుర్తించకుండా, సందేహ నివృత్తి కోసం ప్రయత్నించ కుండా ఉండే అలసత్వం. నిజమైన గమ్యస్థానానికి ఎలా వెళ్ళాలో తెలియని "భయం". ఇన్ని సమస్యలతో అసలు గమనాన్ని మరచి, వున్నది పోగొట్టుకుని, వేరేది ఏదో చేసి తృప్తి పడిపోతున్నాడు మానవుడు. విలువైన బంగారం మూటని చేజార్చుకుంటున్నారు.

**"నియమము తప్పక నీ దోషములను ప్రభుకెరిగించిన రక్షించునుగా"** అన్నారు. ఇందులో...నియమము తప్పక అనేటువంటి మాట కింద గీత గీటుకోవాలి (underline చేసుకోవాలి). మన ప్రభువైన శ్రీ గురుదేవులకు మనలోని దోషాలు తెలియదా? అని మనకి అనిపించవచ్చు కానీ అత్యంత విలువైన శ్రీ గురు సంపద దొరకడం అందరికీ సాధ్యం కాదు కదా ?

# భక్తి - యోగం

- పెనుమాక నాగేశ్వరరావు

"వయసయితే అరవై దాటింది కానీ, ఇప్పటివరకు నాకు భక్తి అంటే ఏమిటో తెలీదు" స్నేహితుడితో చెప్పాను. "అవునా! అదేంటి నువ్వు ఎప్పుడూ గుళ్ళకి వెళుతూనే వుంటావుగా మరి?" అడిగాడు ఆశ్చర్యంగా "వెళుతుంటాను నిజమే. అయినా భక్తి అంటే ఏమిటో తెలియటం లేదు. పోనీ నీకు తెలుసా?" "భక్తి అంటే తెలియకపోవటం ఏమిటి!" "నిజంగానే తెలీదు. నువ్వు చెప్పు. తెలుసుకుంటాను" "నువ్వు నన్ను ఆటపట్టిస్తున్నావులే" "కాదు నిజంగానే అడుగుతున్నాను"

"పెద్ద పెద్ద వాళ్ళంతా చాలా చాలా చెప్పారుగా భక్తి గురించి" "పెద్దపెద్ద వాళ్ళు ఏం చెప్పారో నేనూ విన్నాను. పుస్తకాల్లో చదివాను, నాకు అర్థం కాకనే నిన్ను అడుగుతున్నాను." "అలా అడిగితే నేను మాత్రం ఏం చెబుతాను?" "భక్తి అంటే నువ్వు ఏమనుకుంటున్నావో చెప్పు స్వామి" "భక్తి తొమ్మిది రకాలని గదా అంటారు..." "నేను అడిగింది భక్తి అంటే ఏమిటి అని కానీ, ఎన్ని రకాలు, ఎన్ని రంగులు అని కాదు మిత్రమా"

"భక్తి అంటే నమ్మకం అనుకుంటున్నాను." "నమ్మకం వలన భక్తి ఏర్పడుతుందేమో కానీ, నమ్మకమే భక్తి ఎలా అవుతుంది?" సాలోచనగా తల ఊపాడు మిత్రుడు. "నువ్వు అంటే నాకు అపారమైన నమ్మకం వుంది. నీ పైన భక్తి లేదే!" 'ఇష్టం, ప్రేమ అభిమానం ...' "అవన్నీ భక్తి కాదుగా" ప్రశ్నార్థకంగా నా వంక చూశాడు. "తా చెడ్డ కోతి వనమెల్లా .........అంటే ఇదేనేమో. నా ఆలోచనలన్నీ నీకు అంటగడుతున్నాను" అని నవ్వాను.

"భగవద్గీతలో భక్తి యోగం అని ఒకటుంది. అది చదవక పోయావా?" ప్రశ్నించాడో, సలహా చెప్పాడో అర్థం కాలేదు కానీ పెద్దపెట్టున నవ్వాను. "పోనీ తెలివి అంటే ఏమిటో చెబుతావా?" "మనం విన్నదో,చదివిందో, చూసిందో మనకు అర్థం అయితే మనకు తెలివి ఉన్నట్లే" చెప్పాడు. "ఈ మాత్రం వివరంగా భక్తి అంటే ఏమిటో చెప్పు చాలు" మళ్ళీ నిస్సహాయంగా నా వైపు చూశాడు. "నిజం చెప్పు భగవద్గీత చదివావా?" అడిగాడు మళ్ళీ. "చదివావా, అంటే చదివాను. ఎందుకు చదివానో చెబితే...ఎలా చదివానో కూడా నీకు తెలుస్తుంది. ఓసారి ఓ

పెద్దాయన ప్రవచనం చెబుతూ మనిషై పుట్టాక జీవితంలో ఒక్కసారైనా భగవద్గీత చదివి తీరాలి అని చెప్పిన మాట మనసులో బలంగా నాటుకుంది. ఓ గీతాజయంతి రోజు భగవద్గీత పదునెనిమిది అధ్యాయాలు చదివాను. (శ్లోకాలు కాకుండా, కేవలం తాత్పర్యం మాత్రమే). చదువుతూనే ఒక్కో అధ్యాయంలో నాకు నచ్చిన విషయాలు, అర్థం కాని విషయాలు, ఆశ్చర్యం కలిగించిన విషయాలతో పాటు ఏ ఏ అధ్యాయం లో ఏ విషయం ఉందో సంగ్రహంగా వ్రాసుకున్నాను. ఆ ప్రక్రియ అంతటితో ఆగింది" వివరంగా చెప్పాను.

"సరే...మరి అంతా చదివి, వ్రాసుకుని, సందేహాలు కూడా వ్రాసుకుని నువ్వు గీతా సారాంశం ఏమని తెలుసుకున్నావు?" అడిగాడు స్నేహితుడు. మన జీవితం ఓ సినిమా అనుకుంటే, ఆ సినిమాకి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం, దుస్తులు, పాటలు, మాటలు, నృత్యాలు, సమస్తం ఆ పరమాత్ముడే. మనం కేవలం నటులం మాత్రమే. పాత్రధారులం మనం, సూత్రధారి ఆయన అని అర్థం అయింది "మరింకేం. అది తెలుసు కోవటమే భక్తి అంటే" అన్నాడు మిత్రుడు "తెలుసుకోవటమా? అలా నడుచుకోవటమా!" అని అడక్కుండా ఉండలేకపోయాను. రెండు చేతులూ జోడించి నవ్వాడు.

చదువు ఒక యోగం, సంపద ఒక యోగం, ఇలా మన జీవితంలో మనకి ఆ యోగం ఉంటే మనకు లభిస్తుంది ఏదైనా. భక్తి కూడా అంతే అని అనుకుంటూ ఆ ఉద్దేశంతో భక్తి కూడా ఒక యోగం అనే అర్థం వచ్చేలా భక్తియోగం అన్నానే తప్ప భక్తియోగం గురించి చెప్పేంత విషయం నా దగ్గర లేదని చెప్పి ప్రతినమస్కారం చేశాను. ఆ భక్తి యోగాన్ని ప్రసాదించమని ప్రసాద దేవుణ్ణి ప్రార్థిస్తూ మరోసారి చేతులు జోడిస్తున్నాను.

శ్రీకాళీవనాశ్రమ హైదరాబాద్ శాఖలో 18-9-2024 నుండి 22-9-2024 వరకు సత్సంగ కార్యక్రమములు నిర్వహించ బడును. మరిన్ని వివరములకు 91770 34123, 99483 97063, 98855 55109 నంబరులలో సంప్రదించగలరు.

# భగవద్గీత సాధన దీపిక

- కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

## ప్రథమోధ్యాయము - అర్జున విషాదయోగము

ధృతరాష్ట్రుడికి కురుపాండవుల మహాసంగ్రామం ఎలా జరుగుతున్నదో తెలుసుకోవాలి అన్న ఆరాటం అధికం కాసాగింది. వేదవ్యాస మునీంద్రుని వరప్రభావంతో కురుక్షేత్రంలో కౌరవ పాండవుల మధ్య జరుగుతున్న మహాసంగ్రామమును దివ్య దృష్టితో దర్శించి, ఆ యుద్ధాన్ని కళ్లకు కట్టినట్లుగా తనకు వర్ణించగల సంజయుడితో,



**ధృతరాష్ట్ర ఉవాచ:**

**1. ధర్మ క్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః**
**మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ?॥**

ధృతరాష్ట్రుడు "సంజయా! ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో నా వారైన దుర్యోధనాదులు, పాండవులు ఏమి చేశారో చెప్పు?" అని అడిగాడు.

**సంజయ ఉవాచ:**

**2. దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధన స్తదా**
**ఆచార్య ముపసంగమ్య రాజా వచనమబ్రవీత్ ॥**

**3. పశ్యైతాం పాండుపుత్రాణాం ఆచార్య! మహతీం చమూమ్**
**వ్యూఢాం ద్రుపద పుత్రేణ తవశిష్యేణధీమతా ॥**

సంజయుడు కురుక్షేత్రంలో ఏం జరుగుతున్నదో ధృతరాష్ట్రుడికి వర్ణించి చెపుతున్నాడు. కురుక్షేత్రంలో ఉభయ సైన్యములు తమతమ నాయకులు రచించిన వ్యూహాల్లో అమరి యుద్ధానికి సిద్ధమైనాయి. యుద్ధం ఇంకా ప్రారంభంకాలేదు. ఇంకా ఎవ్వరూ ఏమీ మొదలు పెట్టలేదు. దుర్యోధనుడు మాత్రం అశాంతితో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. అలా ఉద్విగ్నమైన మనస్సుతో, ఇంకా ఎవ్వరూ ఏమీ మొదలు

పెట్టకముందే మొట్టమొదటగా దుర్యోధనుడు ద్రోణాచార్యుడిని సమీపించాడు. దుర్యోధనుడి ఈ ప్రవర్తన ఆతడి మనస్సులో చెలరేగుతున్న అలజడికి, ఆందోళనకు, భయానికి బాహ్య సంకేతం. దుర్యోధనుడు ద్రోణాచార్యుడిని సమీపించి "ఆచార్యా! మీ శిష్యుడు, సూక్ష్మబుద్ధి, ద్రుపద పుత్రుడు అయిన ధృష్టద్యుమ్నుడిచే రచించబడ్డ వ్యూహంలో మోహరించి ఉన్న పాండవ సైన్యాన్ని చూడండి" అన్నాడు. దుర్యోధనుడి మనస్సులోని ఆందోళనకు కారణం లేకపోలేదు. ధృష్టద్యుమ్నుడు ద్రుపదుడికి వరప్రసాదంతో పుట్టినటువంటివాడు. అతడికి ద్రోణుణ్ణి చంపునట్లు వరమున్నది. ఈ విషయం తెలిసి ఉండీ, ద్రోణుడు అతనికి అస్త్రవిద్యను నేర్పాడు. ద్రోణుని ఆ ఔదార్యం తలచుకొన్నకొద్దీ దుర్యోధనుడి మనస్సులో భయాందోళనలు కలుగుతున్నాయి. దుర్యోధనుడి ప్రవర్తన అతనిలో కలుగుతున్న భయాందోళనలను సూచిస్తున్నది.

**4. అత్ర శూరా మహేష్వాసా భీమార్జున సమాయుధి**
**యుయుధానోవిరాటశ్చ ద్రుపదశ్చ మహారథః ॥**

**5. ధృష్టకేతుశ్చేకితానః కాశీరాజశ్చ వీర్యవాన్**
**పురుజిత్కుంతి భోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః ॥**

**6. యుధామన్యుశ్చవిక్రాంత ఉత్తమౌజాశ్చ వీర్యవాన్**
**సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః ॥**

దుర్యోధనుడు ద్రోణునితో "ఆచార్యా! పాండవ సైన్యంలో పరాక్రమంలో భీమార్జునులతో సమానులు, మహారథులు అయిన యుయుధానుడు, విరాటుడు, ద్రుపదుడు, ధృష్టకేతుడు, చేకితానుడు, కాశీరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, శైబ్యుడు, యుధామన్యుడు, ఉత్తమౌజుడు, అభిమన్యుడు, ద్రౌపదీపుత్రులైన ఉపపాండవులు మొదలైన వారిని గమనించండి" అని అంటూ పాండుసైన్యంలోని అతిరథ, మహా రథులను, ఇతర వీరయోధులను గురించి వివరించాడు.

**7. అస్మాకం తు విశిష్టా యే తాన్ని బోధ ద్విజోత్తమ!**
**నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే ॥**

**8. భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః**
**అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తి స్తథై వ చ ॥**

**9. అన్యే చ బహవ శ్శూరా మదర్థే త్యక్త జీవితాః**

నానాశస్త్ర ప్రహరణా స్సర్వేయుద్ధ విశారదాః ॥

10. అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాఽ భిరక్షితం

పర్యాప్తం త్విదమే తేషాం బలం భీమాఽ భిరక్షితం ॥

11. ఆయనేషు చ సర్వేషు యథా భాగమవస్థితాః

భీష్మమేవాఽ భిరక్షంతు భవంత స్సర్వ ఏవ హి ॥

అటు పిమ్మట దుర్యోధనుడు కౌరవసైన్యంలోని అతిరథ, మహారథ శ్రేష్టులైన భీష్మ, కర్ణ, కృప, అశ్వత్థామ, వికర్ణ, సోమదత్తులను గురించి, అతని తనయుడైన భూరిశ్రవసుణ్ణి గురించి, తన కొరకై ప్రాణాలను సహితం అర్పించటానికి సిద్ధపడి వచ్చిన యోధులను గురించి ద్రోణుడికి వివరించాడు.

- సశేషం

***పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు***

*** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

**సెప్టెంబర్ 2024**

19 సోమ: శ్రావణ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

26 సోమ: శ్రీ కృష్ణాష్టమి - శ్రీ సద్గురు పాదపూజ.

28 బుధ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

**అక్టోబర్ 2024**

3 గురు: శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం

9 బుధ: మూలా నక్షత్రం - సరస్వతీ పూజ

10 గురు: దుర్గాష్టమి - కుంకుమ పూజ

11 శుక్ర: మహర్నవమి, - కుంకుమ పూజ

12 శని: విజయదశమి - కుంకుమ పూజ

17 గురు: ఆశ్వయుజ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

26 శని : శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

31 గురు: నరకచతుర్దశి, దీపావళి పండుగ - శ్రీ సద్గురు పాదపూజ.


వాల్మీకి
ముకుంద్
ఏమోయ్ పంతులు! నీ కాడ ఉన్నదంతా ఇచ్చెయి! లేకపోతే సస్తావు!
నా దగ్గర ఉన్నదానితో నీవేమి చేస్తావు, నాయనా?
ఏమి చేస్తానా? నా పెళ్ళాం, పిల్లల్ని పోషించుకుంటాను.


నీ కుటుంబం నీ సంపాదనను పంచుకున్నట్లు నీ పాపాలనుకూడా పంచుకుంటారా?
పంచుకుంటారో లేదో అడిగి చూస్తా.
3
ఏమే! ఇన్నాళ్ళుగా నా సంపదను పంచుకున్నావు. నా పాపాలనుకూడా పంచుకుంటావా?
అమ్మో! మీ పాపాలను పంచుకోవటమా?! ఆ పని ఇతరులెవ్వరూ చేయరు.
4


మీరు చెప్పింది నిజమే స్వామీ! కానీ ఇప్పుడు నేనేమి చెయ్యను?
రామనామ స్మరణ చేయి నాయనా!
5
కానీ నాకు ఆ పదాన్ని పలకడం రాదు!
మరామరా అని ఆగకుండా అంటూ ఉండు.
6


మరామరామరా...
రామరామరామ
7


మరామరామరా...
రామరామరామ
సశేషం ...
8

# శ్రీ నారాయణ స్వామి

సేకరణ - మురళి

ఉప్పరపల్లె నారాయణస్వామి 1901వ సంవత్సరంలో కర్నూలు జిల్లా, పత్తికొండ తాలూకా ఉప్పరపల్లి గ్రామం రైతు కుటుంబంలో జన్మించారు. నారాయణ తండ్రి అప్పా నంజప్ప, తల్లి లక్ష్మమ్మ. నారాయణ అందరి పిల్లలవలె సాధారణంగానే పెరిగాడు. వీధిబడిలో చదువు. తండ్రికి పశువుల పెంపకంలోను, వ్యవసాయ పనులలోను సహాయం చేస్తూ ఉండేవాడు. యౌవనంలో బస్సమ్మతో వివాహం జరిగింది. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలిగారు. వారి జీవితం ప్రశాంతంగా జరుగుతోంది.

ఉప్పరపల్లెకు పడమటవైపు చిన్న బోరబండ గ్రామం ఉండేది. ఆ గ్రామ సమీపములో గంజిగుంట బావి ఉండేది. దానికి సమీపముగా ఒక కుటీరములో ఒక సాధుమహాత్ముడుండేవారు. ఆయన నిరంతరం ధుని వెలిగించేవారు. వచ్చిన ఆర్తులకు ఆ ధునిలోనుంచి బూడిద (భస్మం) తీసి యిచ్చేవారు. అందువలన ఆయనను "బూడిద సాధువు" అని పిలిచేవారు. ఆయన యిచ్చిన భస్మం ధరించినవారికి లేక సేవించిన వారికి కష్టాలు తొలగి అభీష్టాలు నెరవేరేవి. ఈ సాధువు సామాన్యుడు కాదు, మానవరూపములో అవతరించిన వీరభద్రుడని భక్తులు నమ్మేవారు. ఒకరోజు గ్రామవాసులు సాధువు దర్శనానికి వెడుతుంటే వారితోపాటు నారాయణ ఏ కోరిక లేకుండానే వెళ్ళాడు. సాధువుగారు నారాయణను పైకి క్రిందకి చూసి "నీతో పనిఉంది రాత్రికి ఒకసారి రా" అన్నారు. ఎవరినీ రమ్మనని సాధువు తనను ఎందుకు రమ్మన్నారో అని అనుకుంటూ రాత్రికి సాధువుగారి కుటీరానికి వెళ్ళాడు.

తనను అనుగ్రహించే గురువుకోసం సాధకుడైన శిష్యుడు వెదకినట్లు, అర్హుడైన శిష్యునికోసం గురువు కూడా వెదుకుతాడని మహాత్ముల వాక్యం. ఇప్పుడదే జరిగింది. సాధువు నారాయణకు మంత్రోపదేశం చేశారు. తరువాత సాధువు ఆ ప్రదేశం వదలి వెళ్ళిపోయారు. ఇంటికి తిరిగి వచ్చిన నారాయణస్వామికి సంసార జీవితమంతా మాయగా తోచింది. పరమాత్మ అన్వేషణలో ఇల్లు వదిలి వెళ్ళాడు. ఎక్కడ కూర్చుంటే అక్కడే సమాధిస్థితిలోనికి వెళ్ళిపోయేవాడు. నీటి ప్రవాహాలలో, బావులలో జలస్థంభనం చేసి సమాధిలోకి వెళ్ళేవాడు. తన సాధనకు అంతరాయం కలుగుతుందని ఎవరినీ దగ్గరకు

రానిచ్చేవాడు కాదు. కొంతకాలం గడచిన తరువాత దగ్గరకు వచ్చిన భక్తులకు మంచిమాటలు చెప్పి పంపేవాడు. కాలక్రమేణా మహిమలు చూపనారంభించాడు. రాయలసీమలో ఇటువంటి మహాత్ములను తాత అంటారు. నారాయణ స్వామియై, నారాయణస్వామి తాతగా మారాడు.

నారాయణస్వామి గ్రామాలలో సంచరిస్తూ, ఆశ్రయించిన వారికి మంచిమాటలు చెపుతూ వారి కష్టాలు తీర్చేవారు. వ్యాధిగ్రస్తులకు రోగం నయంచేయటం, సంతానం లేనివారికి సంతానం ప్రసాదించే వారు. స్వామి మహిమలు విని దూరప్రాంతాలనుంచి దర్శనార్థమై వచ్చేవారు. వారిని ఆదరించి, వారి సమస్యలు వారు చెప్పకముందు తనే చెప్పి, వాటికి పరిష్కారం చూపించేవారు. పంటలు పండక కరవు పరిస్థితి ఏర్పడినప్పుడు, ప్రజలు స్వామిని ఆశ్రయిస్తే, స్వామి సంకల్పముతో సకాలంలో వర్షాలు పడి సుభిక్షముగా ఉండేది. అక్కడి ప్రజలు అప్పులు లేకుండా ప్రశాంతముగా బ్రతికేవారు. ఒకే సమయంలో అనేక ప్రదేశాలలో ప్రకటితమై భక్తులను అనుగ్రహించేవారు.

తనను నమ్మిన వారికి తమ అంతిమ ఘడియలు ముందుగానే ప్రకటించి, 1965వ సం. శివరాత్రి 3-3-1965 సోమవారం రోజున బ్రహ్మీభూతులయ్యారు. అనంతర కాలములో వారి భక్తులు స్వామికి గుడి, మండపాలు కట్టించి, కంచు విగ్రహం ప్రతిష్ఠించారు. ప్రతినెల పౌర్ణమిరోజున స్వామికి పూజలు జరుగుతాయి. శివరాత్రి రోజున విశేష పూజలు జరుగుతుంటాయి.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***సెప్టెంబర్ 2024 :*** AS 5490, 8367 -8370, 8373-8375, 8385, 8386, 8834, 9226 -9242, 9244-9253 PK 0034, 0035

***అక్టోబర్2024 :*** AS *7197, 8389, 8391, 8396, 8425, 8426, 8427, 8443, 8446, 8940, 9135, 9138, 9255, 9259, 9260* PK *0037, 0038, 0040*

# నారద భక్తి సూత్రములు

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

భక్తి సూత్రము 11: **లోక వేదేషు తదనుకూలాచరణం తద్విరోధిషు ఉదాసీనతా**

తాత్పర్యము: భగవానునికి అనుకూలమైన లోకవేద వ్యాపారములనే చేయుట, వాటికి వ్యతిరేకమైన వాటి పట్ల వుదాసీనతతో వుండుట.



భక్తుడు ఏ వ్యాపారములు చేసినా భగవంతుని యందు తనకు ఉన్న ప్రేమ పెంపొందాలన్న భావనతో చేసినప్పుడు దానికి విరోధమైన ప్రతి భావన యందు సహజంగానే త్యాగము కలుగుతుంది.

గురుదేవుల మీద అత్యంత భక్తి (ప్రేమ) కలిగిన సాధకుడు ప్రతి పనినీ చేసేముందు ఇది తన గురుదేవులకు ఇష్టమైనదా లేదా అని పరీక్షించుకోవాలని శ్రీ మాతాజీ వారు పలు సందర్భాలలో ప్రస్తావించారు. కేవలం గురుదేవుల మీద ఉన్న అనన్య భక్తి మాత్రమే దీనికి కొలమానము. ఆ భావనతో ఉన్న సాధకుడికి గురుదేవుడికి భిన్నమైన ఏ పని మీద అయినా ఉదాసీనత సహజంగానే వస్తుంది.

గమనించాల్సిన విషయం ఏమిటంటే అనుకూలతయే ఆనందానికి కారణం. ఇది నా గురుదేవులకి అనుకూలము అన్న భావన సాధకుడికి ఆనందాన్నిస్తుంది. అదేవిధంగా ఇది నా గురుదేవుల భావనకు ప్రతికూలమన్న విశ్లేషణ ఆ విషయముల యందు ఉదాసీనతకు దారి తీస్తుంది. కానీ సాధకుడు అటువంటి వాటిని నిరసించకుండా కేవలం ఉదాసీనంగా ఉంటాడు. ఎందుకంటే జగత్తంతా తన గురుదేవుల ప్రతిరూపముగా చూడగలిగిన సాధకుడికి నిరసించే అవకాశం ఉండదు కదా! అటువంటి సాధకుడు తన గురుదేవుల సేవకుడు అవుతాడు కానీ లోకవేద వ్యాపారముల సేవకుడు కాదు. ఎందుకంటే లోక వేద వ్యాపారముల ఆచరణకు అంతమన్నది ఉండదు. ఇదే విషయాన్ని గీతాచార్యులు భగవద్గీతలో వివరిస్తూ "**త్రైగుణ్య విషయా వేదా నిస్త్రైగుణ్యోభవార్జున**" అని సెలవిస్తూ లోక వేద వ్యాపారములు

త్రిగుణములతో కూడినవనీ క్రమ క్రమముగా ఆత్మవంతుడివై వాటికి అతీతమవ్వాలని అర్జునునికి బోధించారు.

అనేకములైన లోకవేద వ్యాపారములకు అంతం ఉండదనీ గురుదేవుల ఇష్టాయిష్టాలనే దానికి ప్రమాణముగా తీసుకోవాలని నారదుల వారు ఈ భక్తి సూత్రము ద్వారా తెలియజేస్తున్నారు.

భక్తి సూత్రము 12: **భవతు నిశ్చయదార్యాత్ ఊర్ధ్వం శాస్త్రరక్షణం**

**తాత్పర్యము:** ఆ పిమ్మట దృఢనిశ్చయముతో శాస్త్ర రక్షణము అగుగాక!

ఈ సూత్రము ద్వారా నారదుల వారు సిద్ధ స్థితిని పొందిన తరువాత కూడా మహాత్ములు లోకవేద వ్యాపారములను, నిత్య నైమిత్తిక కర్మలను పూర్తిగా త్యజించక వాటిని శాస్త్ర పరిరక్షణ కోసం అవలంబిస్తారని తెలియజేస్తున్నారు.

ఈ సూత్రములో "భవతు" అంటూ "అగుగాక" అన్న ప్రస్తావనని దృఢ నిశ్చయ సిద్ధికీ అలాగే శాస్త్ర సంరక్షణకు కూడా సమన్వయించు కోవచ్చు. సాధకుడికి నిశ్చయము వుండాలి, అది దృఢంగా కూడా వుండాలి. ఈ రెండూ చాలా ముఖ్యమైనవని నారదులు తెలియ జేస్తున్నారు. సాధకుడికి కలిగిన సంకల్పమే ప్రయత్నం ద్వారా బలపడి ఒక నిశ్చయ మవుతుంది. ఆ నిశ్చయము దృఢమైనప్పుడే సాధన అభివృద్ధి చెందుతుంది. గీతాచార్యులు వ్యవసాయాత్మిక బుద్ధిని కలిగి వుండడం వలననే ఆ నిశ్చయము దృఢమవుతుందని భగవద్గీతలో వివరిస్తారు.

సాధకుడు సాధనావస్థలో గురుదేవులు తనను రక్షిస్తారని చిత్తశుద్ధితో కర్మాచరణము చేస్తాడు. అదే సాధకుడు సిద్ధావస్థలో మాత్రం శాస్త్రాన్ని తాను రక్షించాలని కర్మను ఆచరిస్తాడు. ఏరు దాటాక కూడా తెప్పను పరిరక్షించే విధానంతో దీన్ని పోల్చారు.

మహాత్ములు తాము జ్ఞానిగా ప్రకాశిస్తున్నప్పటికీ శాస్త్ర పరిరక్షణార్థం కర్మాచరణమును ఎంతో ప్రేమతో చేస్తారు. శ్రీ బాబూజీ మహారాజ్ వారు ఆచరించిన పూజలే దీనికి గొప్ప తార్కాణము. "మీకెందుకు బాబూ ఈ పూజలు?" అని అడిగిన భక్తులతో శ్రీ బాబు "నేను చేస్తుంటేనే మీరు చేయట్లేదు నేను చేయకపోతే మీరిక చేస్తారా?" అని ప్రశ్నించేవారు.

తాము ఆత్మజ్ఞానిగా ప్రకాశిస్తూ జనక మహారాజు వారు చేసిన

రాజ్య పరిపాలన కూడా దీనికి ఒక నిదర్శనము. దీని గురించి ప్రస్తావిస్తూ గీతాచార్యులు భగవద్గీతలో **"లోక సంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి"** అంటూ మహాత్ములు ఏ పని చేసినా ఎంతో పరీక్షించి లోక సంగ్రహార్థం మాత్రమే ఆచరిస్తారని వివరించారు. అంతేగాక వారు ఆచరించినదే లోకములోని ఇతరులకు ప్రమాణమై వారు అనుసరిస్తారని **"యద్యదాచరతి శ్రేష్ఠస్తత్త దేవేతరో జనః స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే"** అంటూ గీతాచార్యులు తెలియజేశారు.

పై విధంగా నారదుల వారు ఈ సూత్రం ద్వారా మహాత్ములు శాస్త్ర పరిరక్షణార్థం కార్యాచరణమును ఎలా చేస్తారో వివరించారు.

## సద్గురు పాదుకలు

- కుట్టీ. యన్.

అజ్ఞానానికి కారణం ఈ శరీరం. కనుక ఈ శరీరాన్ని కారణ శరీరం అంటారు. సద్గురు పాదుకలు మనలను జీవన్ముక్తులను చేస్తాయి. గురుదేవుని పాదుకలు రెండిటిలో ఒకటి మనలోని అహంకారాన్ని, మరొకటి మమకారాన్ని హరింపజేస్తుంది. శీతోష్ణ, సుఖదుఖాలను హరిస్తాయి.

పాదము అంటే పదము. అనగా నామం అని కూడా అర్థమున్నది. ఈ పాదపద్మాలు అతి సున్నితమైనవి. గురుదేవుని పాదసేవలో అన్ని పాపాలు తొలగి పోతాయి. మానవుని మాధవునిగా మార్చే శక్తి ఆ పాదపద్మాలకు వున్నది. గురుదేవుని పాద తీర్థాన్ని శిరస్సున ధరిస్తే ఈ మానవుడు అన్ని పుణ్యతీర్థాలలో స్నానం చేసిన పుణ్యాన్ని మూటకట్టుకుంటాడు.

పదమునకు చరణము అని కూడా అర్థము వున్నది. గురుదేవుల పాదోదకము అంటే వారి బోధనల సారాంశము అని అర్థం. వారి పాదాలను ఆశ్రయించి, వారి బోధలను శ్రవణంచేసి, వాటిని ఆచరించి ధన్యులు కావాలి. గురుపాదతీర్థం గ్రోలటం వలన దోషాలు తొలగుతాయి. సంసారమనే సాగరాన్ని దాటించి జ్ఞానాన్ని కలుగ జేస్తుంది. అది అతి పవిత్రమైనది. అపార శక్తి కలిగినది. గురుబోధ శ్రవణం, ఆచరణ వలన గురు అనుగ్రహం, తద్వారా జన్మరాహిత్యం అవుతుంది. గురు భక్తుడు గురుసన్నిధిలో వుండి ఆ ఉచ్ఛిష్టాన్ని భుజించి, గురుబోధా శ్రవణంచేసి, మననం చేసి, దానిని నిదిధ్యాసకు తెచ్చుకోవాలి. అప్పుడే జీవుడు జీవన్ముక్తుడవుతాడు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**సెప్టెంబర్ 2024**

1 ఆది: మాసశివరాత్రి

2 సోమ: అమావాస్య

5 గురు: ఉపాధ్యాయ దినోత్సవం

7 శని : వినాయకచవితి - తె.జా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాద పూజ. ఉ.11.00 గం.లకు సామూహిక వినాయకచవితి పూజలు, భక్త సమారాధన.

18 బుధ: భాద్రపద పూర్ణిమ, ఆశ్రమ ట్రస్ట్ హాస్పిటల్ వార్షికోత్సవం - శ్రీ సద్గురు పాదపూజ

27 శుక్ర: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

30 సోమ: మాసశివరాత్రి

**అక్టోబర్ 2024**

2 బుధ: అమావాస్య

3 గురు: శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం - ఉ.8-19 గం. అంకురార్పణ.

9 బుధ: మూలా నక్షత్రం - సరస్వతీ పూజ

10 గురు: దుర్గాష్టమి

11 శుక్ర: మహర్నవమి, - సామూహిక కుంకుమ పూజలు

12 శని: విజయదశమి - సామూహిక కుంకుమ పూజలు

13 ఆది: ఏకాదశి - ఏకాహం, దీక్షావిరమణ, శ్రీ సద్గురు పాదపూజ.

17 గురు: ఆశ్వయుజ పూర్ణిమ - శ్రీ సద్గురు మండల దీక్ష ప్రారంభం. శ్రీ మాతాజీవారి జన్మదిన మహోత్సవం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

26 శని : శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

30 బుధ: మాసశివరాత్రి

31 గురు: నరకచతుర్దశి, దీపావళి పండుగ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి

(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

**69. పొగడిన మురియక తిట్టిన, వగ జెందక పాపపుణ్య వర్తనలను దా**
**దగులక యేమియు నంటక, నెగడెడు శ్రీరామచంద్రుని గనుమనసా.**

తాత్పర్యము: పొగడ్తలకు పొంగిపోక, తిట్లకు కృంగిపోక పాపపుణ్యముల వలలో చిక్కుకొనక, నిష్కళంకుడవై శ్రీరాముని గనుము మనసా.

**70. సాకార నిరాకారము లేకాకారముగా జేసి యే కాలంబునన్**
**సాకారుండై తనర నిరాకారుండైన రాము నరయుము మనసా.**

తాత్పర్యము: సాకార నిరాకారములను ఒకటిగాజేసి యెప్పుడును సాకారుడై ఉండే ఆ నిరాకారుని శ్రీరాముని తెలియుము మనసా.

**71. చనరాని చోటునకు జని, కనరాని పదార్థములను గనుగొని యైనం**
**గొనరాని సుఖము గైకొని, మనరాదా రామచంద్రు మఱవక మనసా.**

తాత్పర్యము: అందరూ వెళ్ళలేనటువటి ప్రదేశమునకు వెళ్ళి, చూడలేనటు వంటి పదార్థములను తెలిసికొని, అత్యంత ఉన్నతమైన సుఖమును పొంది బ్రతుకు గడపుము శ్రీరామచంద్రుని మరువక మనసా.

**72. అఱుగని యన్నము జవిగొని, యఱకంటను గన్ను మూసి యానందముతో**
**దఱుగని సుఖమున నెన్నం, డెఱుగని భద్రాద్రి వాసు నెఱుగుము మనసా.**

తాత్పర్యము: మితాహారముతో, అంతర్ దృష్టితో, ఆనందముతో తరుగని సుఖముతో ఎవ్వరునూ తెలియజాలని భద్రాద్రి వాసుని తెలియుము మనసా.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

"నేను బలవంతుడనైన ఒక గంధర్వుడిని. నాపేరు కబంధుడు. బ్రహ్మను వేడుకొని దీర్ఘాయుష్షను పొందినవాడిని. దాని మూలంగా గర్వం తలకెక్కి అందరినీ హింసించ మొదలుపెట్టాను. ఒకమారు ఇంద్రుడ్ని చూసి ఆతనితో పోరిడ తలపెట్టాను. ఆతడు తన వజ్రాయుధముతో నన్ను సంహరించలేక నా తల, కాళ్లను నా ఉదరము లోనికి పోవునట్లు చేసాడు. ఇంద్రునియెడ మన్నింపుగోరి, "దీర్ఘ ఆయుష్షను పొందిన నేను ఇకపై ఆహారమును ఎలా తీసుకొన గలను?" అని ప్రశ్నించాను. నాపై జాలి తలచి ఇంద్రుడు ఈ పొడుగాటి చేతులను, ఉదరముపై కంటిని ప్రసాదించి, 'వీని మూలంగా నీవు ఆహారమును సంపాదించుకుని భుజించుచూ, జీవనమును సాగించు' అన్నాడు. నా పాపమునకు విమోచనమెప్పుడని ఆతనిని ప్రశ్నించగా, "కలత చెందవలదు. అయోధ్య యువరాజులు రామ, లక్ష్మణులు ఒక దినము ఈ మార్గముగుండా వస్తారు. వారు నీకు శాప విమోచనమును చేస్తారు. కావున రాముడు వచ్చువరకు నిరీక్షించు!" అని నన్ను అనునయించి వెళ్ళిపోయాడు.

"కబంధా! ఇప్పుడు మీ ఈ భీకర రూపమును పోగొట్టుటకు మేము ఏమి చేయవలయును?" అడిగాడు రాముడు పరితాపముతో. "నాయొక్క ఘోరమైన ఈ శరీరమును మట్టిలో పాతిపెట్టి, వదలివేయండి. అది చాలు" అన్నాడు కబంధుడు.

రామలక్ష్మణులిరువురూ అలా చేయగనే, ఆ మట్టినుండి సౌందర్యముట్టిపడు ఒక గంధర్వుడు బయటకు వచ్చాడు. "నాకు ఇంద్రుని శాపమునుండి విముక్తి కలిగించినందులకు మిక్కిలి కృతజ్ఞతలు రామా! నేను మీకు ఒక ఉపకారము చేయదలచుకున్నాను. ఏమి కావాలో కోరుకో?" అన్నాడు కబంధుడు.

"అయ్యా! నా భార్య సీతను రావణుడను ఒక రాక్షసుడు తీసుకుని వెళ్ళిపోయాడు. ఆమెను తీసుకుని వచ్చుటలో మీరు నాకు

ఏదైనా సహాయం చేయగలరా!?" ప్రశ్నించాడు రాముడు.

"కలత చెందవలదు రామా! నీలాగే, తన భార్య రుమను కోల్పోయి జీవించుచున్న కిష్కింధకు చెందిన వానర వీరుడు సుగ్రీవునితో స్నేహం చేయుము. ఆతడు ఈ సమయమున తన అన్నయైన వాలికి భయపడి ఋష్యమూక పర్వతములలో దాక్కుని జీవిస్తున్నాడు. ఆ పర్వతము గోదావరికి నైఋతి దిక్కున ఉంటుంది. భార్యను తిరిగి పొందుటలో సుగ్రీవునికి నీవు సహాయపడినట్లైనచో ఆతని మూలంగా నీవుకూడ సీతను మరల పొందగలవు" అని బదులిచ్చి కబందుడు వెళ్ళిపోయాడు.

అచ్చటనుండి రామలక్ష్మణులిరువురూ ముందుకు కదలి, గోదావరి తీరమును దాటి, కిష్కింధవైపుకు పయనిస్తూ, మార్గ మధ్యమున మాతంగముని ఆశ్రమం చేరుకున్నారు. వారిని గూర్చిన వివరములు విచారించినప్పుడు ఆ మునివర్యులు మోక్షం చెందారని, అచ్చట శబరి అని పిలవబడుచున్న వేటగాండ్ర జాతికి చెందిన ఒక ముదుసలి అవ్వ ఉంటుందని వారికి తెలిసింది. "ఆ ముదుసలి అవ్వ మాత్రం ఒక పిచ్చిదానివలె ఎప్పుడూ 'రాముడు ఇంకా రాలేదే' అనుకొనుచు అనేక సంవత్సరములు గొణుక్కుంటూ ఉంటుందట" అని దారిన పోయేవాళ్ళు చెప్పారు.

ఆశ్చర్యమునకు లోనైన రాముడు, "ముందువెనుక తెలియని నా కొరకు ఎదురుచూస్తూ, నన్ను చేరడానికి ఆశపడుచున్న ఆ ముదుసలి అవ్వను ఎలాగైనా చూడాలి లక్ష్మణా!" అని తమ్ముడితో చెప్పి ఆ ఆశ్రమం లోనికి వెళ్ళాడు.

ఆశ్రమమందు శబరి ధ్యానమందు నిమగ్నమై ఉంది. ఆమె మౌనం వీడువరకు రాముడు అలా నిరీక్షించాడు. కళ్ళను తెరచిన శబరి వారిద్దరినీ ఆశ్చర్యముతో చూసింది. "మీరెవరు?" అని ప్రశ్నించిన ఆమెకు వారిరువురూ తమను తాము పరిచయము గావించుకున్నారు.

- సశేషం

# కర్మయోగ రహస్యము

సేకరణ - కీ.శే. ఎమ్. జానకిరామ శాస్త్రి

**"మత్కర్మకృ న్మత్పరమో మద్భక్త సంగవర్జితః।**

**నిర్వైర స్సర్వభూతేషు య స్స మామేతి పాణ్డవ!॥"** (భ.గీ. -11/55)

"అర్జునా! తన ధర్మములను నా ఆరాధన బుద్ధితో చేయు వాడును, నేనే ప్రధానోద్దేశముగా గలవాడును, పరమ ప్రీతితో నన్నే ధ్యానించు వాడును, నాకంటే వేరైన వస్తువులతో తనకు సంబంధము లేనివాడును, సకల ప్రాణుల యందును విరోధము లేనివాడును, ఎవడో అతడు నన్ను పొందుచున్నాడు."

భగవానుడు అర్జుననకు జ్ఞాన నేత్రమును ప్రసాదించి తన విశ్వరూపమును చూపించి , పిదప ఉపసంహరించుకుని, అర్జనునితో ఈ నా విశ్వరూపమును అనన్య భక్తి చేతనే తెలిసికొనగలడు" అని తెలిపెను.

మానవ జీవితం పని (కర్మ)-చేయడం కోసం ఏర్పడినది. ఒక వ్యక్తికి ఒక ఊళ్ళో ఉద్యోగం వస్తే, ఆ ఉద్యోగం ఉన్నంత వరకూ, ఆ ఊరిలో ఆ ఉద్యోగకృత్యమేదో దానిని నెరవేరుస్తూనే ఉండాలి. అలానే మానవ శరీరంలోకి రావడానికి లక్ష్యం ఈ శరీరాన్ని వినియోగిస్తూ, ఇచ్చిన వాడివైపు ప్రయాణం కొనసాగించడం.

అనేక జన్మలనుండి తెచ్చి పెట్టుకున్న కర్మల భారాన్ని తగ్గించు కోవడానికి మానవదేహం అన్నిటికంటే ఉత్తమమైన సాధనమని భగవంతుడు జీవుడికి ఈ శరీరాన్ని లభించేలా చేశాడు. అయితే ఈ జీవుడు తన ప్రవృత్తి వల్ల, కర్మలను తొలగించుకోవచ్చు, కర్మలను పెంచుకోవచ్చు కూడ. శరణాగత భావంతో కర్మలు చేస్తే వాటి ఫలితం నీకు అంటదు సరికదా, గతంలో ఉన్న ప్రారబ్ధ కర్మనంతటినీ భస్మంచేసి పారేస్తుంది. దూది బోలెడంత ఉన్నా ఓ చిన్న నిప్పుకణం దానిలో వేస్తే అంత దూదిని అదెలా భస్మం చేయగలదో అలానే చేయవలసిన కర్మలను మనం సరిగా చేస్తే అది ఎన్నెన్నో జన్మలనుంచి పేరుకుపోయి ఉన్న పాపరాశినంతటినీ భస్మం చేసి పారేస్తుంది.

కాబట్టి నువ్వు చేయవలసినదల్లా భగవన్నామాన్ని మనో మందిరంలో నింపుకుని కర్మలనాచరించాలి.

మొదటి శ్వాసనుంచి తుది శ్వాసదాకా మానవుడు కర్మ చేస్తూనే ఉంటాడు. నీవు ఇక్కడకు వచ్చినది కేవలం కర్మాచరణ కోసమే. మానవ శరీరమే జీవుడికి ఒక ఉద్యోగం. ఇందులో మొదటి శ్వాస నుంచి తుదిశ్వాస దాక ఉద్యోగపు సమయం. కనుక ఉద్యోగ సమయంలో ఇతర ప్రవృత్తులు పనికిరావు. ఫలాశ తగదు. పని (కర్మ) చేయక తప్పదు. పనిమానడం తగదు.

భగవంతుని ప్రీతి కోసం చేసే పనిని "సేవ" లేక "కైంకర్యము" అని అంటారు. **మత్కర్మ కృత్** - "నీవు ఏపని చేసినా నా పనిగా చేయి!" దానములు చేయి, ధర్మములు చేయి, యాగములు చేయి, నా సేవ అనుకుంటూ చేయి. నీవు చేసే ఏపనైనా నా సేవగా చేయి. అది నీకు బంధకం కాకుండా నేను చూస్తాను" అంటున్నాడు భగవానుడు.

రెండవది **మత్పరమః** - నీవు ఏది చేసినా అది చెందేది నాకు అని గుర్తించు. నాకంటే మించి మరొకరు ఎవరూ ఫలితాన్నివ్వగలిగిన వాడు లేడు. **సంగవర్జితః మద్భక్తః** - నా యందు భక్తితో ఇతరమైన వాటి యందు అనాసక్తుడవై నాతోనే సంగము కలిగియుండుము.

**నిర్వైర సర్వ భూతేషు** లోకంలో దేనియందూ వీడికి వైరం ఉండదు. లోకంలో అన్నిటి వెనుక ఉండి నడిపించే తత్త్వం పరమాత్మ అయినపుడు, ఒకడు మిత్రుడు, ఒకడు శత్రువు అనే ప్రశ్న ఎక్కడ ఉంటుంది? నిజమైన జ్ఞానం కల వ్యక్తికి ఈ దృష్టి ఏర్పడుతుంది. అన్నింటా భగవంతుణ్ణి చూస్తాడు. అలాంటి వాడు నా దివ్యమైన సాయుజ్యాన్ని పొందగలుగుతాడు.

మనం మన పనులు భగవత్పరం చేద్దాం, సంగం భగవంతుని యందు ఉంచుకుందాం, ఆ భగవదనుగ్రహాన్ని మనం మన వారందరికీ పంచుదాం! మాధవ సేవగా "సర్వప్రాణి సేవ" చేయగలిగే యోగ్యత మనకి మరింతగా ప్రసాదించమని కోరుదాం! మానవ సేవే మాధవ సేవగా చేద్దాం! మాధవ అనుగ్రహాన్ని పొందే ప్రయత్నం చేద్దాం!

# శ్రీ గురుగీతా

-కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**అచిన్త్యా వ్యక్తరూపాయ నిర్గుణాయ గుణాత్మనే ।**
**సమస్త జగదాధార మూర్తయే బ్రహ్మణేనమః ॥ 1**

**<u>పదవిభాగము</u>** :-

అచిన్త్య, అవ్యక్త, రూపాయ-నిర్గుణాయ-గుణాత్మనే -
సమస్త జగత్ ఆధారమూర్తయే-బ్రహ్మణే-నమః

**<u>టీక</u>** :- అచిన్త్య = మనస్సు చింతించుటకు వీలుగాని; అవ్యక్తః ఇంద్రియములకు వ్యక్తము (ప్రకటము) గాని, రూపాయ = రూపముగల; నిర్గుణాయ = గుణములులేని; (లేదా) లెక్కించుటకు వీలుకాని అనంత కల్యాణ గుణములుగల; గుణాత్మనే = గుణములే స్వరూపమైన; సమస్త జగత్ = సమస్త ప్రపంచమునకు (జగత్తుకు) ఆధారమూర్తయే = ఆధారమైన స్వరూపము గల; బ్రహ్మణే = పరబ్రహ్మ స్వరూపుడగు గురుదేవునకు; నమః= నమస్కారము.

**<u>వ్యాఖ్య</u>** :- "శ్రీ గురుగీత" స్కాందపురాణాంతర్గతమే అయినా ప్రత్యేక ప్రతిపత్తి కల్గిన శాస్త్రముగా పరిగణించబడుతున్నది. అందుచేతనే "అథ" అనే సౌమంగల్యార్థకమైన పదముతో ప్రారంభింపబడినది. అందులోనూ మొదటి అక్షరము "అ". ఇది "ఓం" అనే ప్రణవానికి మొదటి అక్షరమేగాక "అకారో వాసుదేవస్య" అను హారవళీ నిఘంటువు యిచ్చిన అర్థమును బట్టి సర్వవ్యాపకమైన వాసుదేవ స్మరణముతో మొదలవుతున్నది. ఈ శ్లోకము శాస్త్రమునకు నాంది గనుక "ఆశీర్నమస్క్రియా వస్తు నిర్దేశము"లను మూడు ప్రయోజనములూ దీని ద్వారా సాధించబడుతున్నాయి. బ్రహ్మమైన గురు పరబ్రహ్మమునకు నమస్కారము. గుణాత్ముడైన లేక గుణములు కలిగినట్లు కనిపించుచున్న గురుస్వరూపమును నిర్గుణ పరబ్రహ్మముగా తెలుసుకొనుట అనే ప్రయోజనమూ, ఆ ప్రయోజనము సిద్ధించుగాక అని దీనిని అధ్యయనం చేస్తున్న అంతేవాసికి (శిష్యునకు) ఆశీర్వచనమూ గౌణముగా తెలియజేయ బడుచున్నవి.

ఏ విషయమునైనను ప్రమాణము ద్వారముననే తెలుసుకొనవలెను. ఆ ప్రమాణములు (1) ప్రత్యక్షము (2) అనుమానము (3) ఉపమానము (4) శబ్దము. కాని పరమాత్మ విషయమున యీ నాలుగు ప్రమాణములూ (తర్క శాస్త్రంలో అంగీకరింపబడినవి) కుంఠితమగుచున్నవి. గురుదేవుడనగా యిక్కడ "అవ్యక్త" స్వరూపుడని చెప్పబడుచున్నది. వ్యక్తమనగా ఇంద్రియములతో తెలియబడునది. కనుక ప్రత్యక్ష ప్రమాణముద్వారా, ఆయన అవ్యక్తుడు గనుక, ఆయనను తెలుసుకొనలేము.

ప్రత్యక్షము మీద ఆధారపడినది అనుమానము, చూచిన దానిని బట్టి మనస్సుతో చూడని దానిని ఊహించి తెలుసుకొనుట అనుమానము. ఆయన "నిర్గుణుడు" గనుక – అవ్యక్త మూర్తి గనుక – అచింత్యుడు. అనగా మనస్సుతో గ్రహించుటకు వీలుకానివాడు. తెలిసిన దానిని ఉపమానముతో చెప్పవచ్చు గాని, తెలియని దానిని – అందునను 'నిర్గుణుని, నిరంజనుని' – గూర్చి చెప్పుట కుదరదు. ఇచ్చట శబ్దమైన వేదముకూడ "యతోవాచోనివర్తంతే అప్రాప్య మనసా సహ" అన్నది గనుక శబ్దమువలన – అనగా వేదము వలన కూడ తెలియబడదు.

వేదము వలన నేరుగా తెలియబడకపోయినను – వేదమును అనుభవ రూపముగా పొందిన ఆప్తుడైన గురుదేవుడు మాత్రమే యీ రహస్యమును వెలిబుచ్చుటకు సమర్థుడు. నిర్గుణుడైన తాను గుణాత్మకుడుగా కన్పించుటయే గాక, (జ)జనించి (గ)గతించునదైన యీ జగత్తున కాధారమూర్తిగానున్న ఆ గురుదేవుడే బ్రహ్మ జ్ఞాన విషయమున సమర్థుడు. "బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి" అనే ప్రమాణాన్ని బట్టి గురుదేవునికే ఇచ్చట "బ్రహ్మణే నమః" (పరబ్రహ్మమునకు నమస్కారము) అనినమస్కరింపబడినది.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీబుల్లిమామయ్య తెలిపిన శ్రీబాబు లీలలు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

6. సంపూర్ణ దక్షిణ యాత్ర పూర్తి చేసుకుని శ్రీ బాబు భక్తులతో విజయవాడ చేరుకున్నారు. "కనుక దుర్గాలయానికి వెళ్ళి జగన్మాత దర్శనం చేసుకొని రండి" అని భక్తులను పంపి, శ్రీబాబు బయటనే ఉన్న పిట్ట గోడ వద్ద నిలబడి బుల్లిమామయ్య గారితో మాట్లాడుతున్నారు. ఆ సమయంలో కంచికామకోటి పీఠం పరమాచార్యులైన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వాములవారు మల్లికార్జున స్వామివారి ఆలయ ప్రతిష్ఠకుగాను వేంచేసి ఉన్నారు. వారు మల్లికార్జున స్వామివారి ఆలయం వైపు పరివార సమేతులై వెడుతూ శ్రీ బాబును చూసి, తమ పరివారమును వెడుతూ ఉండమని చెప్పి, శ్రీ బాబు వద్దకు వచ్చి కొంత సేపు సంభాషించారు. శ్రీబాబుతో "నాయనా! నీవు గొప్ప తపశ్శాలివని నాకు తెలుసును. హిందూ ధర్మానికే యీ నాడు ఘోరమైన గ్లాని సంభవించింది. దాని నుండి లోకాన్ని రక్షించవలసిన బాధ్యత మన అందరి మీద ఉన్నది" అన్నారు. శ్రీ బాబు చిరునవ్వుతో సమాధానమిచ్చారు. (సీతారామయ్యగారి కథనం).



7. భీమవరంలో చల్లా కృష్ణమూర్తిగారు, చలపతిగారు, మరొక భక్తులు ప్రతి రోజూ సాయంత్రం ఊరి చివరికి వెళ్ళి నిర్జన ప్రదేశంలో ప్రశాంతంగా సత్సంగం జరుపుకునే వారు. ఒకరోజు వాళ్ళు మాట్లాడుకుంటూ "పరశురామయ్యగారు మాటి మాటికి శ్రీ బాబును గురించి దైవమని, సర్వాంతర్యామి అని చెబుతూ ఉంటారు గదా! నిజంగా ఆయన సర్వాంతర్యామి అయితే, నేనిప్పుడు మనస్ఫూర్తిగా శ్రీబాబును ధ్యానించి, ఆయన యిక్కడకు రావాలని కోరుకుంటాను. వస్తారా?" అన్నారు. ఆ మాట పూర్తి కాకముందే, కృష్ణమూర్తిగారి వీపు తడుతూ "ఏమిటయ్యా! నన్నిపుడు పిలిచావు?" అని శ్రీబాబు వెనుక నుండి వచ్చి పలకరించారు. వారు ముగ్గురూ ఆశ్చర్యానందాలలో మునిగి పోయారు.

8. శ్రీ బాబుతో 1966లో జరిగిన ఉత్తరదేశ యాత్రకు సీతారామయ్యగారు కూడా వెళ్ళారు. ఒక చోట శ్రీ బాబు ఎవరి సామాను వారినే మోసుకుని రమ్మని, తమ లగేజీని తామే మోసుకు వస్తున్నారు. సీతారామయ్యగారు మధుమేహ వ్యాధి వలన నీరస పడిపోయారు. కొండ ఎక్కవలసి రావటం వలన అలసిపోయి తన సామానుతో సహా

దోవలో కూర్చుండిపోయారు. మిగతావారంతా శ్రీ బాబుతో చకచకా ముందుకు వెళ్ళి పోయారు. సీతారామయ్యగారికి తెలుగు తప్ప మరే భాషా రాదు. ఏమీ దిక్కు తోచక దిగులుతో "బాబూ!" అనుకున్నారు. అప్పటికే శ్రీ బాబు చాలా దూరం ముందుకు వెళ్ళి పోయారు. కాని చిత్రంగా, శ్రీబాబు వెనుక నుండి వచ్చి "ఏమిటి మామయ్యా? నీరసంగా ఉందా?" అని పలకరించారు. అక్కడే చెట్టు క్రింద ఎవరో మామిడి తాండ్ర అమ్ముతుంటే శ్రీ బాబు రెండు బిళ్ళలు కొని, ముందుగా తాము వాటిని నోటితో చప్పరించి, (నివేదన చేసుకుని) బుల్లి మామయ్యకిచ్చారు. "ఇవి తినేసెయ్యి బుల్లిమామయ్యా! నీకిక యాత్ర సమాప్తమయ్యే వరకు నీరసం రాదు" అన్నారు. సీతారామయ్యగారు ఆ ప్రసాదం తీసుకున్నారు. అంతే! యాత్ర పూర్తి అయ్యే వరకు నీరసమన్న మాట మరచి పోయారు. అది మామిడి తాండ్ర ప్రభావం కాదు, గురుప్రసాద ప్రభావం.

9. రాజమండ్రిలో జయంతులు జరుగుతున్నాయి. భక్తులందరు మహా ప్రసాదానికి (భోజనానికి) కూర్చున్నారు. శ్రీ బాబు అక్కడికి వచ్చి చక్ర పొంగలి (తీపి వంట) వడ్డిస్తున్న ఆయనను పిలిచి, సీతారామయ్యగారికి వడ్డించమన్నారు. ఆయన గరిటతో వేస్తుంటే, మొత్తం గిన్నె విస్తట్లో గుమ్మరించి "బుల్లి మామయ్యా! కానియ్!" అని శ్రీ బాబు మరొక బంతిలోకి వెళ్ళారు. సీతారామయ్యగారు 'తీపి కదా!' అని భయపడి తినకుండా, శ్రీ బాబు చూస్తారేమోనని ఆ చక్ర పొంగలిని అన్నంతో కప్పి పెడుతున్నారు. అప్పుడు శ్రీ బాబు ఎవరితోనో మరొకవైపు తిరిగి మాట్లాడుతూ, యిటు తిరగకుండానే, "బుల్లి మామయ్యా! అన్నంతో చక్ర పొంగలిని కప్పి పెట్టకు. నాకు కనబడుతూనే ఉంది. భయపడకు. మొత్తం తినేసెయ్యి" అంటున్నారు.

ఇలా పదిరోజులూ స్వీటు వడ్డించి తినిపించారు శ్రీ బాబు. ఉత్సవాలు అయిపోయాక బుల్లి మామయ్య సెలవు కోసం వెడితే, ఏదో మాట్లాడుతూ మధ్యలో, అప్పుడే జ్ఞాపకం వచ్చినట్లుగా "అన్నట్లు బుల్లి మామయ్యా! నీకు షుగరు ఉంది కదూ!" అన్నారు. "అవున"న్నారు బుల్లి మామయ్య. శ్రీబాబు "అయ్యో! ఎంతపని జరిగిపోయింది? నేను ప్రతి రోజు నీ విస్తట్లో స్వీటు వేస్తుంటే, మెదలకుండా సందు దొరికింది గదా అని లోపలికి పంపించి వేశావు గాని, 'నాకు షుగరు ఉంది బాబూ! తీపి తినకూడదు' అని ఒక్కనాడైనా జ్ఞాపకం చేశావా?" అని కేకలు వేసినట్లుగా అని, ప్రక్కనే ఉన్న శర్మతో "నువ్వు మామయ్యను తీసుకుని వెళ్ళి వెంటనే షుగరు పరీక్ష చేయించి తీసుకురా" అన్నారు. పరీక్ష చేయిస్తే, షుగరు మామూలుగానే ఉన్నది. శ్రీబాబు "పోనీలే మామయ్యా! ఇక్కడ నేను పెట్టించాను గనుక, ప్రసాద భావంతో తిన్నావు గనుక సరిపోయింది. అలాగని, యింటికి వెళ్ళాక కూడా తినకు సుమా! జాగ్రత్తగా ఉండు. లేకపోతే నీ కోసం నేను మళ్ళీ రావలసి వస్తుంది" అన్నారు.

- సశేషం

## విష్ణు  కథలు

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

# చైతన్య మహాప్రభువు

చైతన్యులవారి భక్తి ఉద్యమంలో ఎందరో చేరి తమ బ్రతుకులను సార్థకం చేసుకున్నారు. వారిలో శ్రీ అద్వైతాచార్య, శ్రీ నిత్యానంద ప్రభు, శ్రీ హరిదాస్ ఠాకూర్, రూప సనాతన సోదరులు ముఖ్యులు.



హరిదాస్ ఠాకూర్ మహా భక్తుడు. జన్మకు మహ్మదీయుడయినా పూర్వ జన్మ సంస్కారముచేత అతనికి హరి భక్తి అబ్బింది. శ్రావ్యమైన కంఠంతో హరి నామ సంకీర్తన చేసేవాడు. ప్రతిరోజు మూడు లక్షల కృష్ణనామ జపం చేసేవాడు. అతని భక్తి ప్రపత్తులు ఎందరినో ఆకర్షించాయి. అతను మహ్మదీయుడని ద్వేషించేవారూ లేక పోలేదు.

హిందువుగా జన్మించిన రామచంద్రుడనేవాడు మహమ్మదీయ సాంప్రదాయాన్ని స్వీకరించి "రామచంద్ర ఖాన్"గా మరాడు. అతడు హరిదాస్ మీద ద్వేషంతో దుష్ప్రచారం చేసేవాడు. హరిదాస్‌ను అపఖ్యాతి పాలు చేయటానికి అతని వద్దకు వేశ్యలను పంపాడు. అయినా హరిదాస్ చలించలేదు. ఆమె పశ్చాత్తాపపడి, క్షమించమని వేడుకుంది. తన పాచిక పారనందున రామచంద్ర ఖాన్, "ఇతడు మహమ్మదీయ మతాన్ని పాడుచేసి హిందువులతో కలిశాడు" అని నవాబుకు ఫిర్యాదు చేశాడు. నవాబు హరిదాసును మహమ్మదీయ మతం తీసికొమ్మని నిర్భందించాడు. "నాకు హరి నామమే ప్రియము, నేను మతాన్ని మార్చుకోను" అని చెబితే, రాజాజ్ఞ ప్రకారం అతనిని కొరడాలతో కొట్టారు. హరిదాస్ గోవింద

నామం చేస్తూ శ్వాస బిగించి మరణించినవాడి వలె పడిపోతే అతనిని గంగా నదిలో పారవేశారు. అతడు ఈదుకొని బయటకు వచ్చి నవద్వీపానికి చేరాడు.

చైతన్యులవారు, నిత్యానందులను, హరిదాసును, నామ ప్రచారానికి సారథులుగా నియమించారు. వారు భగవన్నామామృతపానమే భవరోగాన్ని హరింపచేసే దివ్యౌషధమని బోధించేవారు. చైతన్యుల భక్తి ఉద్యమం నవద్వీపంలో సంచలనం తెచ్చింది. నవద్వీపాన్ని పాలించే నవాబు హరినామ సంకీర్తన జరగటానికి వీలులేదని శాసించారు. భక్తి ప్రచారం జరిగే చోట రాజభటులు వచ్చి భక్తులను హింసించారు. ఖాజీ ఆజ్ఞ మేరకు రాజ్యంలో సంకీర్తనలు జరగరాదని, అలా జరిగితే ప్రాణాలు దక్కవని బెదిరించి వెళ్ళిపోయారు. చైతన్యులకు ఈ విషయం తెలిసింది.

ఈ పరిస్థితిలో ఖాజీ ఆజ్ఞకు కట్టుబడి సంకీర్తన ఆపటం కంటే ఖాజీని ఎదిరించి నిలవాలి అని చైతన్యులు నిశ్చయించారు. మరునాడు ఆలయంలో విశేష సంఖ్యలో భక్తులు చేరారు. వారిని నాలుగు శ్రేణులుగా విభజించారు. ప్రథమ శ్రేణికి అద్వైతాచార్యులు నాయకత్వం వహించారు. ద్వితీయ శ్రేణికి హరిదాస్ ఠాకూర్ నాయకత్వం వహించారు. తృతీయ శ్రేణిని శ్రీనివాసులు నడిపించారు. చతుర్థ శ్రేణికి గదాధర, నిత్యానందులతో చైతన్యులే నాయకత్వం వహించి అశేష జన ప్రవాహంతో సంకీర్తన చేస్తూ, నృత్యం చేస్తూ ఉద్యమ రథం ముందుకు సాగింది. ఖాజీ హృదయంలో ధైర్య సాహసాలు సన్నగిల్లాయి.

ఖాజీ సంస్థానానికి వచ్చింది సంకీర్తనా ఉత్సవము. అయినా ఖాజీ తలుపులు తీయలేదు. చైతన్యులు తలుపు దగ్గర నిలబడి, "ఖాజీ చర్చలు జరపకపోతే తిరిగి వెళ్ళేది లేద"ని తెలిపారు. మరో దారిలేక చైతన్యులవారిని చర్చల కోసం లోపలికి పిలిచారు.

- సశేషం

# శ్రీ కాళీ వనాశ్రమ శాఖ, భీమవరము,
# పశ్చిమ గోదావరి జిల్లా (ఆం.ప్ర)

### భవన నిర్మాణము

సమర్థ సద్గురుదేవులు శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారు లోక కళ్యాణం కొరకై ఎన్నో చోట్లకు వెళ్ళి ఎందరో భక్తుల ఆర్తిని బాపిన అవతార పురుషులు. వారు నడయాడిన ఊరు భీమవరము మరియు ఆ చుట్టు ప్రక్కలనున్న యనమదుర్రు, దిరుసుమర్రు మొదలగు గ్రామములు. శ్రీ స్వామివారు మహా ప్రస్థానం పొంది 35 సంవత్సరములు అయినవి. ఇచ్చటి భక్తులందరూ చేరి భీమవరం-ఉండి రోడ్డున దాతలు ఇచ్చిన స్థలములో బృందావనము, దాని ప్రక్కన అన్నదాన శాల, వసతి గృహము నిర్మింప సంకల్పించినారు. ఈ భవన శంకుస్థాపన శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతి యోగిని శ్రీచంద్ర కాళీ ప్రసాద మాతాజీవారు, ది.10-05-2023 తెల్లవారు జామున 3.24 గం.లకు చేశారు.



ఈ సందర్భమున భక్తులకు చేయు విన్నపమేమనగా, మీరెల్లరూ ఎంతో ఉదారస్వభావముతో ముందుకు వచ్చి త్వరలో ఈ భవన నిర్మాణము పూర్తియగు నట్లు తమ సహాయ సహకారములను ధన రూపేణ, వస్తు రూపేణ అందించమని ప్రార్థించుచున్నాము.

విరాళములు ఈ క్రింది బ్యాంక్‌కు పంపవలెను.
Sri Sri Sri Hanumat Kali Vara Prasad Babu Trust
Bank of Baroda, Nambur Branch
S/B Account No : 69900 1000 00 172
IFSC : BARB0DBUNAM (5th character is 'zero')
Contact Numbers
Murali : 93983 34345
Tummalapalli Siva : 96181 99556

**భక్తులు ఒసగు విరాళములకు ఐ.టి యాక్ట్ 80జి క్రింద పన్ను రాయితీ లభించును.**

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

# జూన్ 11 నుండి జులై 10, 2024 వరకు శ్రీ మాతాజీవారి అమెరికా పర్యటన దృశ్యములు









REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

జులై 4 నుండి 7, 2024 వరకు అమెరికాలోని
శ్రీ దుగ్గిరాల శ్రీనివాస్ గారి గృహమునందు జరిగిన
త్రయాహ్నిక దీక్ష, సామూహిక పూజ, సత్సంగ దృశ్యములు.







If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.